ఈనాడు తిరుపతి
మంగళవారం అక్టోబరు 15, 2024 | 5

వరద ప్రవాహం.. రాకపోకలు నిషేధం



అల్పపీడన ప్రభావంతో ఎగువన కురుస్తున్న వర్షాలకు పెళ్లకూరు మండలం పాలచ్చూరు ఆనకట్టపై నీటి ప్రవాహం పెరిగింది. దీంతో కలవకూరు-ముమ్మారెడ్డిగుంట గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సోమవారం రాత్రికి ప్రవాహం మరింత పెరిగే అవకాశముందని తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. ఈ మార్గంలో రాకపోకలు నిషేధించినట్లు చెప్పారు.

- న్యూస్‌టుడే, పెళ్లకూరు

తిరుమలలో వర్షం



తిరుమల, న్యూస్‌టుడే: అల్పపీడనం నేపథ్యంలో తిరుమలలో సోమవారం తెల్లవారు జాము నుంచి వర్షం ప్రారంభమైంది. దశలవారీగా కురుస్తున్న వర్షంతో భక్తులు తడిసి ముద్దయ్యారు. చలితీవ్రత పెరిగింది. మరో మూడు రోజులపాటు వర్షాలు కురవనుండటంతో తితిదే అధికారులు అప్రమత్తమై ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు.

విపత్తు నివారణకు ముందస్తు వ్యూహం

- అప్రమత్తమైన యంత్రాంగం
- ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా పటిష్ఠ చర్యలు

బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి కారణంగా రానున్న మూడు రోజులు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తమైంది. ముఖ్యంగా జిల్లా పరిధిలోని ఐదు కోస్తా మండలాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. అధికారుల సెలవులు రద్దు చేయడంతోపాటు జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ప్రత్యేకంగా సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించనున్నారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ స్పష్టం చేశారు.

- ఈనాడు, తిరుపతి

జిల్లా పరిధిలోని ఐదు కోస్తా మండలాల్లో ప్రభావం అధికంగా ఉంటుందని అధికారులు గుర్తించారు. ఇక్కడ మొత్తం 75 కి.మీ.ల మేర కోస్తా ప్రాంతం ఉండటంతోపాటు 41 వేల మంది ప్రజలు నివాసం ఉంటున్నారు. ఇప్పటికే వీరిని అప్రమత్తం చేశారు. ఇక్కడున్న 1,038 పడవలు సముద్రంలోకి వెళ్లకుండా నిరోధించారు. గూడూరు డివిజన్ పరిధిలో ఒక ఎస్‌డీఆర్ఎఫ్ బృందాన్ని అందుబాటులో ఉంచారు. ఎక్కడైనా ప్రజలు నీటిలో చిక్కుకుని ఉంటే వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేశారు.

సహాయ కేంద్రాల నంబర్లు

కలెక్టరేట్: 0877 2236007
గూడూరు సబ్ కలెక్టరేట్ 86242 52807
సూళ్లూరుపేట ఆర్డీవో : 86232 95345
తిరుపతి ఆర్డీవో : 86869 66559
శ్రీకాళహస్తి ఆర్డీవో: 99665 24952



కోట ఆర్టీసీ బస్టాండ్‌లో నిలిచిన నీరు..

జలాశయాలపై సమీక్ష

జిల్లాలోని ప్రధాన జలాశయాల్లోని పరిస్థితిపై అధికారులు సమీక్షించారు. అరణియార్‌లో 1.8 టీఎంసీల నీటికి ప్రస్తుతం 0.5 టీఎంసీలు, కల్యాణి డ్యాంలో 0.9 టీఎంసీలకి 0.1 టీఎంసీలు, కండలేరులో ప్రస్తుతం 31 టీఎంసీలు మాత్రమే ఉండటంతోపాటు 800 క్యూసెక్కులు దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. మల్లెమడుగులో 0.181 టీఎంసీలకు ప్రస్తుతం 0.019 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాళంగి జలాశయ గేట్లు గతంలో కొట్టుకుపోయిన నేపథ్యంలో అక్కడ సిబ్బందిని అప్రమత్తం చేశారు. మరోవైపు పర్యాటక ప్రాంతాలైన కైలాసకోన, అర్రె, సముద్ర బీచ్ ప్రాంతాల్లో 14 నుంచి 17వ తేదీ వరకు సందర్శకులకు అనుమతి నిరాకరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. తడ, సూళ్లూరుపేట, సత్యవేడు, నాయుడుపేట, శ్రీకాళహస్తి డివిజన్లలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, అత్యవసర పరిస్థితుల్లో సమాచారం ఇవ్వాలని కోరారు.

యుద్ధప్రాతిపదికన సహాయ కార్యక్రమాలు

తిరుపతి (నగరం): ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిలో విద్యుత్తు లైన్లు దెబ్బతింటే యుద్ధప్రాతిపదికన సహాయ కార్యక్రమాలు చేపట్టాలని ఆ సంస్థ సీఎండీ సంతోషరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం డిస్కం పరిధిలోని అధికారులతో మాట్లాడారు. పునరుద్ధరణ పనుల కోసం నోడల్ అధికారులను నియమించినట్లు చెప్పారు. విద్యుత్తు సమస్యల పరిష్కారానికి సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వర్షం కురిసే సమయంలో ప్రజలెవరూ స్తంభాలను తాకవద్దని విజ్ఞప్తి చేశారు.

చెరువులు భద్రం

జిల్లాలోని చెరువుల కరకట్టలపై ఇప్పటికే అధికారులు దృష్టిసారించారు. ప్రస్తుతం చెరువుల్లో 25 శాతం మేరకు నీరు ఉందని, అందువల్ల ఇబ్బందులు తలెత్తవని భావిస్తున్నారు.

రవాణాపై..

జిల్లాలో రవాణా వ్యవస్థపైనా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీళ్లు ఉన్నప్పుడు వాహనాల రాకపోకలు సాగకుండా చర్యలు తీసుకున్నారు. కాజ్‌వేలపై నీటి ప్రవాహం అధికంగా ఉంటే వాహనాలను అనుమతించవద్దని సూచించారు. రెవెన్యూ, పోలీసులు, రవాణా, ఇతర యంత్రాంగం సమన్వయంతో పనిచేసేలా కలెక్టర్ తగిన ఆదేశాలు ఇచ్చారు.

తితిదే సైతం..

భారీ వర్షాల నేపథ్యంలో ఈ నెల 16న తితిదే వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసింది. కొండ చరియలపై ప్రత్యేక నిఘా ఉంచారు. కనుమ రహదారుల్లో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. విద్యుత్తుశాఖ అప్రమత్తంగా ఉండాలని, జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. తిరుమలలోని జలాశయాల పరిస్థితిని ఈవో సమీక్షించారు.

కాలువ గట్టు.. కనపడితే ఒట్టు



పేరూరులో కాలువ గడ్డను చదునుచేసి పొలంలో కలిపేసుకున్న దృశ్యం

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: పోరంబోకు కాలువలు, గట్లు ఆక్రమణదారులకు రూ.కోట్లు కురిపిస్తున్నాయి. వాటిని ఆక్రమించరాదని దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలిచ్చినా తమకు పట్టవన్నట్లు రూ.కోటిన్నర విలువ చేసే కాలువ గడ్డను చదును చేసి పొలంలో కలిపేసుకున్నారు.

పేరూరు పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి ఉండటంతో ప్రభుత్వ కాలువ పోరంబోకు, కాలువ గడ్డలకు రక్షణ కరవైంది. సర్వేనం. 164లో పేరూరు చెరువు నుంచి పాతకాల్వ మీదుగా తుమ్మలగుంట చెరువుకు వరదనీటి కాలువ ఉంది. ఇది సుమారు 50 అడుగుల వెడల్పుతో విస్తరించింది. కాలువ జాతీయ రహదారికి పక్కనే ఉండటంతో చుట్టూ స్థిరాస్థి వెంచర్లు పదుల సంఖ్యలో వెలిశాయి. అంకణం విలువ రూ.లక్ష పైనే పలుకుతోంది. ఈ నేపథ్యంలో కాలువ పక్కన ఉన్న సాగుదారులు జేసీబీలతో చెట్లు తొలగించి, గడ్డను చదును చేసేశారు. ఆక్రమణను ఓసారి అడ్డుకున్నా లెక్కచేయక చెరువు

రూ.కోటిన్నర స్థలం చదును

మట్టితో నింపేసి పొలంలో కలిపేసుకున్నారు. బయటి వ్యక్తులకు అక్కడో కాలువ ఉందన్న అనుమానమే రాకుండా చేసేశారు.

పరిశీలించి చర్యలు..

కాలువలు, గడ్డలు, కుంటలు ఆక్రమించడం చట్టరీత్యా నేరం. విషయం నా దృష్టికి రాలేదు. సిబ్బందిని పంపించి పరిశీలిస్తాం. ఆక్రమణ ఉంటే స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తాం. - **రామాంజులు నాయక్, తహసీల్దార్, తిరుపతి గ్రామీణ**

అదృష్టవంతులకే కిక్కు

- లక్కీడిప్ ద్వారా జిల్లాలోని 227 దుకాణాల కేటాయింపు
- 16 మంది మహిళలకు అవకాశం
- రేపటి నుంచి నూతన మద్యం విధానం అమలు



శిల్పారామం కల్యాణ మండపంలో లక్కీడిప్ తీస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

జిల్లాలోని మద్యం దుకాణాలు:	227
వచ్చిన దరఖాస్తులు:	3,920
లైసెన్స్ ఫీజు:	రూ.23.53 కోట్లు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం విధానం బుధవారం నుంచి అమలు కానుంది. ఇందులో భాగంగా జిల్లాలోని 227 మద్యం దుకాణాలకు లాటరీలు తీసి ప్రైవేటు రిటైల్ వ్యాపారులను ఎంపిక చేశారు. స్థానిక శిల్పారామంలో సోమవారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ వెంకటేశ్వర్ లాటరీ ద్వారా ఎంపిక ప్రక్రియ ప్రారంభించారు. తిరుపతి అర్బన్‌లోని ఏడో నంబరు దుకాణం 44 దరఖాస్తులతో ప్రథమ స్థానంలో నిలవగా.. శ్రీకాళహస్తి డివిజన్ తొట్టంబేడు పీఎస్ పరిధిలోని 75వ దుకాణం నాలుగు దరఖాస్తులతో చివరి స్థానంలో నిలిచింది. 75 మంది మహిళలు దరఖాస్తులు సమర్పించగా.. 16 మందిని అదృష్టం వరించింది. దరఖాస్తు సొమ్ము రూ.2 లక్షలు కాకుండా లైసెన్స్ ఫీజులోని ఆరో వంతు సొమ్మును అప్పటికప్పుడే చెల్లించారు. అధికారులు వెంటనే తాత్కాలిక లైసెన్సులు మంజూరు చేశారు.



విజేతల సంతోషం

బృందాలుగా దాఖలు..

రాజకీయ నాయకులు, మద్యం రంగంలో అనుభవం ఉన్న వ్యాపారులు కొందరు బృందాలుగా ఏర్పడి దరఖాస్తు చేశారు. లాటరీలో దుకాణం దక్కగానే కేరింతలు కొట్టారు. తిరుపతి అర్బన్‌లోని ఓ బృందం 312 వరకు దరఖాస్తులు చేయగా ఆరు దుకాణాలు దక్కాయి. మరో బృందం 72 దరఖాస్తులు సమర్పించగా రెండు దుకాణాలు వరించాయి.

- విశ్రాంత పోలీసు అధికారి రెండు దరఖాస్తులు ఇవ్వగా.. ఓ దుకాణం దక్కింది. చంద్రగిరికి చెందిన మరొకరు నాలుగు దరఖాస్తులు చేయగా ఒక దుకాణానికి ఎంపికయ్యారు. చంద్రగిరిలో రెండు వర్గాలకు చెందిన బృందాలకు నిరాశ మిగిలింది. శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట ప్రాంతాల్లో స్థానిక బృందాలు దుకాణాలు కైవసం చేసుకున్నాయి.

ఇటు చేరి దుకాణాలు దక్కించుకుని

వైకాపా సానుభూతిపరులైన మద్యం వ్యాపారులు ఒకరిద్దరు.. కూటమి పార్టీ సానుభూతిపరులతో కలిసి పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసి లబ్ధి పొందారు. తిరుపతిలోని ఓ వ్యాపారి ఇదే తరహాలో ఆరు దుకాణాలు దక్కించుకోగా.. తిరుపతి రూరల్, చంద్రగిరి, వెంకటగిరిలో అలాగే అదృష్టం వరించిందనే ప్రచారం జరిగింది. నూతన మద్యం విధానంలో రూ.2 లక్షల దరఖాస్తు సొమ్ము తిరిగిరాదని తెలిసినా కొత్తవారు తమ అదృష్టం పరీక్షించుకున్నారు. పాత వ్యాపారులు బృందాలుగా ఏర్పడి దరఖాస్తులు సమర్పించారు.

వర్షంతో ఇబ్బందులు

అల్పపీడన ప్రభావంతో వేకువజాము నుంచి వర్షం కురవడంతో దరఖాస్తుదారులు శిల్పారామం వద్దకు రావడానికి.. అక్కడ ఎదురు చూడటానికి ఇబ్బందిపడ్డారు. పోలీసులు అనుమతి పత్రాలు, ఫొటో గుర్తింపు కార్డులను పరిశీలించి సెంట్రల్ హాల్‌లోకి అనుమతించారు. ప్రతి డివిజన్ నుంచి దరఖాస్తుదారులను నిర్దేశిత సమయం ప్రకారమే లోపలకు అనుమతించారు. ప్రత్యేక ఫుడ్ కౌంటర్ ఏర్పాటు చేశారు.



దుకాణం దక్కించుకున్న తిరుపతికి చెందిన భారతి



దుకాణం దక్కించుకున్న నాగలాపురానికి చెందిన ఎ.రమ్య

పారదర్శకంగా ఎంపిక: కలెక్టర్

జిల్లాలో మద్యం దుకాణాలకు టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఎలాంటి వివాదాలకు తావులేకుండా ఎంపిక జరిగిందని, ఈ నెల 16 నుంచి నూతన దుకాణాలు ప్రారంభం అవుతాయన్నారు.

బాలబడి.. సృజన కొరవడి



చిన్నారులతో కృత్యాలు చేయిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది (పాతచిత్రం)

జిల్లాలో ఐసీడీఎస్ వివరాలు

ప్రాజెక్టులు:	కేంద్రాలు:	3-6 ఏళ్లలోపు అర్హులైన పిల్లలు:	అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన చిన్నారులు:
12	2,492	49,430	35,430

అందని పాఠ్యపుస్తకాలు, అమలుకాని కార్యక్రమాలు

చిన్నారుల ఆటపాటలు, సృజనాత్మక వేదికలుగా వెలుగొందాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు మొక్కుబడిగా మారాయి. పూర్వ ప్రాథమిక విద్య అమలులో లోటుపాట్లు నెలకొని కేవలం పౌష్టికాహార పంపిణీ కేంద్రాలుగానే మిగిలిపోతున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా అరకొరగా ఉన్న పాత పుస్తకాలతోనే బోధన సాగించాల్సి వస్తోంది. దీంతో ఆశించిన ప్రయోజనం లేకపోగా సామాన్య కుటుంబాలు సైతం కాన్వెంట్ల పేరుతో రూ.వేలల్లో ఖర్చు చేయాల్సిన దుస్థితి ఎదురవుతోందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

- న్యూస్‌టుడే,తిరుపతి (భవానీనగర్), నారాయణవనం

నిర్దేశిత కార్యక్రమాలు ఇలా..

మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు ప్రాథమిక విద్యనందించిన అనంతరం వారిని నేరుగా ఒకటో తరగతిలో చేర్చేలా గతంలో నూతన విద్యావిధానం అమలుకు చర్యలు తీసుకున్నారు. పాఠ్యపుస్తకాల రూపకల్పనతో పాటు ప్రణాళికలు అమలుచేశారు. ప్రీ ప్రైమరీ-1, 2 పేరిట రెండు రకాల పుస్తకాలు పంపిణీ చేసి విద్యాబోధన చేసేవారు. పాటలు, పద్యాలతో పాటు నెలలు, వారాలు, రోజులు తదితర ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పించేవారు. ప్రణాళిక ప్రకారం ఏ రోజు ఏం బోధించాలన్నది పట్టిక రూపంలో ఇవ్వాల్సి ఉంటుంది. ఆంగ్లంలోనే సులువుగా అర్థమయ్యేలా పదాలు చెప్పడం, వాటి అర్థాలు తెలుసుకోవడం, సృజనాత్మకత జోడించి ఆటపాటలతో నృత్యాలు చేయించడం వంటివి అమలు చేయాలి. ప్రస్తుతం పర్యవేక్షణ కరవై చాలావరకు కేంద్రాల్లో సక్రమంగా అమలు చేయలేని దుస్థితి.

పునశ్చరణ.. కానరాని ఆచరణ

చిన్నారులు నేర్చుకునే పాఠ్యాంశాల్లోనూ తల్లిదండ్రుల పాత్ర ఉండాలనే ఆశయంతో, వారిని సైతం భాగస్వాములను చేసేలా తరగతుల వారీగా తల్లిదండ్రుల ఫోన్ నంబర్లతో వాట్సాప్ బృందాలు గతంలో ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో బోధించిన అంశాలు, చేయించిన కృత్యాల వివరాలను ఆయా బృందాలకు పంపడంతో సాయంత్రం ఇంటి వద్ద పునశ్చరణ చేయించాల్సి ఉంటుంది. పాఠ్యపుస్తకాలు పంపిణీ కాకపోవడం, క్షేత్రస్థాయిలోని సిబ్బంది నిర్లక్ష్యంతో వీటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేని పరిస్థితి నెలకొంది.

పంపిణీకి చర్యలు

జిల్లాలో కేంద్రాలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. అలాగే పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలు చేసేలా పర్యవేక్షిస్తాం.

- **జయలక్ష్మి, పీడీ, ఐసీడీఎస్**

టెట్‌కు 1,088 మంది హాజరు

తిరుపతి (బైరాగిపట్టెడ): జిల్లా వ్యాప్తంగా సోమవారం నాలుగు కేంద్రాల్లో జరిగిన టెట్‌కు మొత్తం 1,088 మంది హాజరయ్యారు. ఉదయం 70 మందికిగాను 60 మంది, మధ్యాహ్నం 1,336 మందికిగాను 1,028 మంది హాజరయ్యారు.

సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా సోమవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు నిండిపోయి ఏటీజీహెచ్ వరకు వేచిఉన్నారు. వీరికి దాదాపు 15 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. ఆదివారం శ్రీవారిని రూ.86,900 మంది దర్శించుకోగా.. రూ.2.56 కోట్ల హుండీ కానుకలు లభించాయి.



గూడూరు మండలం తిమ్మసముద్రం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనుల శిలాఫలకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

ప్రగతిపథం దిశగా.. పల్లె పండగ

తిరుపతి (భవానీనగర్), న్యూస్‌టుడే: పల్లె పండగ మొదలైంది. ఈ ఏడాది ఆగస్టు 23న గ్రామసభల్లో చేసిన తీర్మానాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు మొత్తం మీద 1026 సీసీ రోడ్ల పనులకు రూ.50.30 కోట్లు, 373 సీసీ డ్రెయిన్ పనులకుగాను రూ.31.50 కోట్లు, 970 గోకులాలకు రూ.22.60 కోట్లు కేటాయించారు. వీటితోపాటు శ్మశాన వాటికలు, ఉద్యాన పనులు ప్రారంభించనున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో అనుకున్న అంచనాలకన్నా తక్కువ సంఖ్యలో అభివృద్ధి పనులు ప్రారంభించామని, ప్రతిపాదిత లక్ష్యం మేరకు పనులు సకాలంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

అసలే వానలు.. నోరుతెరిచిన కాలువలు



తిరునగరిలో పలు కూడళ్లు, రహదారులు ప్రమాదకరంగా పరిణమించాయి. మురుగు నీటి కాలువలపై పైకప్పులు లేకపోవడం భక్తులు, పాదచారుల పాలిట శాపంగా మారింది. తాతయ్యగుంట గంగమ్మ అమ్మవారి ఆలయం వద్ద పైకప్పు ఏర్పాటు చేయకుండా ఇలా వదిలేశారు. వర్షాలు, వరదల నేపథ్యంలో ఇందులో నీళ్లు చేరినా, ఆదమరిచి ఎవరైనా కాలు ముందుకేసినా ప్రాణప్రాయం నెలకొనే అవకాశం ఉన్న నేపథ్యంలో నగరపాలక అధికారులు స్పందించి ఇలాంటి వాటిపై వెంటనే మూతలు, ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

- ఈనాడు, తిరుపతి

భారీ వర్షాలతో తితిదే అప్రమత్తం

తిరుమల, న్యూస్‌టుడే: భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని తితిదే ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. స్థానిక అన్నమయ్య భవనంలో అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. 2021లో కొండచరియలు విరిగి పడిన ఘటన అనంతరం తితిదే 700 పేజీలతో విపత్తు నిర్వహణ ప్రణాళిక రూపొందించిందన్నారు. ఈ ప్రణాళికను మరింత మెరుగుపరచాలని అధికారులకు వారు సూచించారు. కొండచరియలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఘాట్‌రోడ్లలో ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్తుకు అంతరాయం లేకుండా చూడటంతోపాటు ఐటీ విభాగం నుంచి భక్తులకు అందించే సేవలపై అవసరమైతే ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

రైతేరాజు 6లో

సేద్యంలో రాణింపు

నేడు జాతీయ గ్రామీణ మహిళా రైతు దినోత్సవం

అతివలు సాగులో తమదైన ముద్రవేస్తూ కుటుంబ నావను గట్టెక్కిస్తున్నారు. వరుస నష్టాలు ఎదురైనా అప్పులు తరుముతున్నా కాడి వీడటం లేదు. కొద్దిపాటి పొలంలోనే పంటలు వేసుకుని కంటికి రెప్పలా కాపాడుకుంటున్న సేద్యపు రాణులు ఎందరో. ప్రభుత్వ ప్రోత్సాహకాలు సరైన పద్ధతుల్లో వినియోగించుకుంటూ వినూత్న దారిలో సాగుతున్నారు. నేడు 'జాతీయ గ్రామీణ మహిళా రైతు దినోత్సవం' సందర్భంగా 'ఈనాడు' పలువురిని పలకరించింది.

- ఈనాడు డిజిటల్, తిరుపతి

కష్టాలు ఎదురించి..



నెరబైలు గ్రామానికి చెందిన చెంగమ్మ భర్త పాక్షిక అంధత్వంతో బాధపడుతున్నారు. చేతికొచ్చిన కుమారుడు నాలుగేళ్ల కిందట మరణించాడు. ఆర్థిక ఇబ్బందులు సైతం తట్టుకొని తనకున్న రెండెకరాల్లో వ్యవసాయం చేస్తోంది చెంగమ్మ. టమాటా వేసి చాలాసార్లు నష్టపోయింది. మరోవైపు అదే పొలంలో కొంతభాగం చేపల చెరువుకోసమని గుంత తవ్వించి చేతులు కాల్చుకుంది. ఇక చాలు వ్యవసాయం అనే పరిస్థితులు ఎదురైనా వెనుకడుగు వేయలేదు. భూమితల్లిని నమ్ముకుని ముందుకు సాగింది. ఇటీవల టమాటా ధర అనూహ్యంగా పెరగడంతో అప్పులు తీర్చి లాభం తన ఖాతాలో జమచేసుకుంది. ఆ చేపల గుంతనూ పూడ్చి సాగు చేయాలని చూస్తోంది.

- కావలి చెంగమ్మ, యల్లావారిపాలెం

డ్రోన్ సేద్యంతో వినూత్నంగా

కొన్నెంబట్టు గ్రామానికి చెందిన పోలమ్మ ఎమ్మెస్సీ చదివారు. వివాహం అనంతరం ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమవుతూనే తమకున్న పదెకరాల్లో వ్యవసాయం చేసేవారు. నాలుగేళ్ల నుంచి భర్త వేరే ఉద్యోగం చేస్తుండగా పోలమ్మనే పదెకరాల్లో వరి సాగు చేస్తోంది. ఇదేతరుణంలో ఓ ప్రైవేట్ సంస్థ పురుగుమందు పిచికారీకి డ్రోన్ అందజేసింది. ఎకరం పొలంలో ఆరు నిమిషాల్లోనే డ్రోన్‌తో పురుగు మందు పిచికారి చేస్తోంది. పది లీటర్ల సామర్థ్యంగల డ్రోన్ సెట్టింగ్స్ మొదలు ఆపరేటింగ్ వరకు తనే చూసుకుంటూ సాగులో నిమగ్నమవుతోంది.



- కమతం పోలమ్మ, సూళ్లూరుపేట

ప్రకృతి సేద్యమే మేలని..

టీవీ కపార్లు గ్రామానికి చెందిన రాఘమ్మ డిగ్రీ పూర్తిచేసింది. వివాహం అనంతరం సంఘమిత్రలో వీవోగా పనిచేసింది. ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యం గుర్తించి 2008 నుంచే ఆచరిస్తోంది. ఇరుగుపొరుగు వాళ్లను ఆదిశగా ప్రోత్సహిస్తోంది. ఎకరం పొలంలోనే ఒకపక్క వరిపంట వేస్తూ, చిన్నపాటి స్థలంలో ఏటీఎం పద్ధతిలో కూరగాయలు పండిస్తోంది. చేతికొచ్చిన వడ్లను నేరుగా అమ్మకుండా వాటిని బియ్యంగా మార్చి అమ్మడంతో కిలో సుమారు రూ. 60పైగా ధర పెట్టి అమ్ముతూ లాభాన్ని గడిస్తోంది. మరోవైపు పురుగుమందులు లేకుండా పండించిన కూరగాయలను అమ్ముతూ అందరి ఆరోగ్యాలను కాపాడుతోంది.



- బాదురు రాఘమ్మ, రామచంద్రాపురం

డీఎస్సీ ఉచిత శిక్షణ

చిత్తూరు (జిల్లా పంచాయతీ) : డీఎస్సీకి ఎంపికైన గిరిజన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మూర్తి తెలిపారు. మూడునెలల శిక్షణలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. చిత్తూరు, తిరుపతి, కడప, అన్నమయ్య జిల్లాల యువతీ యువకులు https://jnanabhumi.ap.gov.in లో ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోలీసు సేవకులకు నగదు పురస్కారాలు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాలు భవిష్యత్తులోనూ మరింత ఉత్తమంగా నిర్వహిద్దామని ఎస్పీ సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. ఉత్తమ సేవలందించిన పోలీసులకు సోమవారం ప్రశంసాపత్రాలు.. నగదు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాల్లో ప్రతిఒక్కరూ అత్యుత్తమ స్థాయిలో సేవలందించారని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరాచారి, నాగభూషణరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పోలీసు ఉన్నతాధికారులతో ఎస్పీ సుబ్బరాయుడు

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	135
రిటైల్	157
లేయర్	120
బ్రాయిలర్	228
బ్రాయిలర్ స్కిన్ లెస్	259
లేయర్ మాంసం	204

తల్లిదండ్రుల అభీష్టాన్ని నెరవేర్చండి

తిరుపతి (వైద్యవిభాగం): వైద్య విద్యార్థులు వృత్తిలో ఉత్తమంగా ఎదిగి తల్లిదండ్రుల అభీష్టాన్ని నెరవేర్చాలని స్విమ్స్ సంచాలకులు డా.ఆర్వీ కుమార్ పిలుపునిచ్చారు. 2024-25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు.. వారి తల్లిదండ్రులతో ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యవిద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, మానసిక ధృఢత్వం పెంచుకోవాలన్నారు. డీన్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ అపర్ణ బిట్ల, ప్రిన్సిపల్ ఉషా కళావత్, వైస్ ప్రిన్సిపల్ నాగరాజు, డాక్టర్ ముక్తేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు. ఎస్వీఎంసీలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరపు తరగతులు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ రవిప్రభు మాట్లాడారు. ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, వైద్యులు సునీత, బీఎస్ఎన్ మూర్తి, పాహీం, సుజాత పాల్గొన్నారు.



నూతన విద్యార్థికి తెల్లకోటు అందజేస్తున్న స్విమ్స్ సంచాలకులు ఆర్వీ కుమార్


తితిదే విద్యాసంస్థల్లో హాస్టల్ సీట్లు పెంచాలి

తిరుపతి (విద్యావిభాగం): తితిదే విద్యాసంస్థల్లోని విద్యార్థులకు వసతి గృహాల్లో సీట్లు పెంచాలని సోమవారం తితిదే విద్యాశాఖ అధికారి నాగరాజ నాయుడుకు ఏపీ స్టూడెంట్స్ ఐకాస ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. తితిదే విద్యాసంస్థల్లో చేరిన 60 శాతం మందికి తప్పనిసరిగా వసతి ఏర్పాటు చేయాలనే నిబంధన ఉందని, దీనిని వెంటనే అమలుపరచి విద్యార్థులకు న్యాయం చేయాలని ఐకాస అధ్యక్షుడు హేమాద్రి యాదవ్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.

లాభదాయకంగా పచ్చిమిర్చి

కోట, న్యూస్‌టుడే: అన్నదాతలు పంట మార్పిడి విధానం ద్వారా సాగు చేస్తే అధిక దిగుబడులు పొందేందుకు అవకాశం ఉంది. ప్రధానంగా అన్ని సీజన్లలో డిమాండ్ ఉండే అత్యంత ఖరీదైన పచ్చిమిర్చి సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. 50శాతం వరకు ఆదాయం పొందే అవకాశం ఉంది. కోట మండలంలోని వెంకన్నపాళెం, తిన్నెలపూడి, గూడలి, రంగన్నగుంట, కేశవరం, చిట్టేడు పరిసర ప్రాంతాల్లో పచ్చిమిర్చి సాగు చేస్తున్నారు. అధిక దిగుబడులు, ఆదాయాలు పొందుతున్నారు.

సాగు విధానం: పచ్చిమిర్చి ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు చేస్తారు. ఇసుక, బంకమట్టి నేలల్లో సాగు చేయవచ్చు. అధికమైన తేమను తట్టుకోలేదు. భారీ నీటి పారుదల వల్ల ఏపుగా పెరుగుదల ఉండదు, పువ్వులు రాలిపోతాయి. మొత్తంగా రెండు పర్యాయాలు దుక్కి దున్నాలి. తరువాత దుక్కిలో ఎకరాకు 100 కిలోల డీఏపీ, పశువుల పేడను ఎరువుగా వేసుకోవాలి. అవసరం మేరకు మందులు పిచికారీ చేయాలి.



రక్షణ చర్యలు: ప్రొద్దుటూరుకు చెందిన మిరప నారును ఎకరాకు వెయ్యి మొలకలు వేయాలి. రెండు అడుగుల దూరానికి ఒక మొలక నాటాలి. వారం రోజుల తరువాత మొలకలు వస్తాయి. కలుపు రాకుండా చూసుకోవాలి. నెల రోజులకు మొదటి విడత కాపు వస్తుంది. అందులో 700 నుంచి 800 కిలోల వరకు వస్తాయి. తర్వాత రెండో విడత రెండు వేల కిలోల వరకు వస్తాయి. మూడో విడత 8వేల కిలోల వరకు వస్తాయి. ఒక్కొక్క మొక్క 10 కేజీలకు పైగా దిగుబడిని ఇస్తుంది.


మార్కెట్ విధానం: చెన్నైకు రవాణా చేస్తారు. కోట, వాకాడు, చిట్టమూరు, గూడూరులోని మార్కెట్లకు తరలిస్తారు. ప్రస్తుతం కిలో రూ.20 నుంచి రూ.30 వరకు పలుకుతోంది.

రూ.50వేలు ఆదాయం..

ఎకరాలో గతేడాది సాగు చేస్తే రూ.2లక్షల పెట్టుబడి పెట్టా. అమ్మకాల ద్వారా రూ.2.50లక్షల ఆదాయం వచ్చింది. రూ.50వేలు ఆదాయం మిగిలింది. ఈ ఏడాది కూడా సాగు చేస్తున్నాను.



- కస్తూరయ్య, రైతు, వెంకన్నపాళెం



పెరటి సాగుకు తరుణమిదే

పుత్తూరు, న్యూస్‌టుడే: మనం రోజూ తినే ఆహారంలో పోషక విలువల దృష్ట్యా పండ్లు, కూరగాయలకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. పెరట్లో పండిన కూరగాయలు కొనుగోలు చేసే వాటి కన్నా తాజాగా, రుచిగా ఉండటంతో పాటు రసాయనాలు ఉండవు. వీటి పెంపకం ప్రతి ఇంట్లో చేపడితే ప్రయోజనమని పుత్తూరు ఉద్యానశాఖాధికారిణి వెంకటసౌజన్య తెలిపారు. ◗ గ్రామాల్లో, పట్టణాల్లో ఖాళీ స్థలాలుంటే అందులో కొంత భాగం ఎంపిక చేసుకుని శుభ్రం చేసి నేలను దున్నుకోవాలి. ◗ టమోటా, వంగ, మిరప, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ లాంటి కూరగాయల నారు నాటుకోవాలి. ◗ బహు వార్షిక మొక్కలైన కూర అరటి, నిమ్మ, కరివేపాకు, మునగ తదితర మొక్కలను తోటకు ఉత్తర దిశగా నాటు కోవాలి. వాటి నీడ ఇతర మొక్కలపై పడకుండా ఉంటుంది. ◗ దీర్ఘ కాలిక కూరగాయలైన క్యాబేజీ, క్యాలీఫ్లవర్ పంట మడుల్లో వరుసల మధ్య స్వల్పకాలిక ఆకుకూరలైన పాలకూర, మెంతికూర, కొత్తిమీర, బచ్చలి పెంచుకోవాలి. ◗ పెరటి కంచెపై మూడు వైపులా వేసవి, వర్షాకాలాల్లో కాకర, బీర, సొర, నేతిబీర, దోస, పొట్ల వంటి తీగజాతి పాదులు, శీతాకాలంలో చిక్కుడు, బఠాణీలు నాలుగోవైపు పెంచుకోవాలి. తోటల్లోని అన్ని పంటలకు అవసరాన్ని బట్టి నీరు పెట్టి కంపోస్టు ఎరువులు వేస్తూ ఉండాలి.

ప్రశ్న జవాబు

రేణిగుంట, న్యూస్‌టుడే: వ్యవసాయంలో రైతులు ఎదుర్కొంటున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన మండల వ్యవసాయాధికారి సునీల్‌కుమార్.

ప్రశ్న: ఆర్ఎన్ఆర్ 15048 వరి రకం నాటిన 30 నుంచి 40 రోజుల లోపు గత సంవత్సరం వెన్ను వచ్చింది. దీనిని అరికట్టాలంటే నారు ఎప్పుడు నాటుకోవాలి?

- మునిరెడ్డి, గాజులమండ్యం

జవాబు: నవంబర్ 15 తరువాత నారు విత్తుకొని డిసెంబర్ 10 తరువాత వరి నాట్లు వేసుకున్నట్లయితే వెన్ను అనుకున్న సమయానికి వస్తుంది. దీనివల్ల యాజమాన్య ఖర్చులు తగ్గి పంట దిగుబడి అధికంగా వస్తుంది. **- సునీల్‌కుమార్, మండల వ్యవసాయాధికారి, రేణిగుంట మండలం**

వర్షా కాలం.. సంరక్షణ లక్ష్యం

వర్షాలు ప్రారంభం అయ్యే సమయం సమీపించిందని, ఈ పరిస్థితుల్లో మూగజీవాల సంరక్షణ విషయంలో అలక్ష్యం వద్దని శ్రీకాళహస్తి పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్.వి.శ్రీకాంత్‌బాబు తెలిపారు. వరదలు, తుపాన్లు సంభవించినప్పుడు పశుపోషకులు ఈ తరహా జాగ్రత్తలు పాటిస్తే ప్రాణ నష్టం, వ్యాధుల బారిన పడకుండా సంరక్షించుకోవచ్చునని తెలిపారు.

◗ పశువులకు ఇచ్చే నీటిని బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రపరచాలి. ◗ పశువుల పాకలను తేలికపాటి ఆకులు, కొబ్బరి మట్టలు తదితర వాటితో వేసుకుంటే గాలి తీవ్రతకు అవి కూలిపోయినా పెద్దగా నష్టం ఉండదు. ◗ బాహ్యపరాన్న జీవుల నిర్మూలనకు క్రిమి సంహారక మందులు విధిగా వాడాలి. ◗ నిల్వ ఉన్న నీటిలో దోమలు, ఈగలు పెరిగే ప్రమాదముంది. తద్వారా వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువ. అలాంటి పరిస్థితులు లేకుండా జాగ్రత్త పడాలి. వీలైనంత వరకు పశువులు ఉన్న ప్రదేశంలో నీటి నిల్వలు లేకుండా శ్రద్ధ చూపాలి. ◗ రోగ నిరోధక శక్తి తగ్గి పశువులు వ్యాధులకు గురయ్యే అవకాశముంది. పశువుల్లో వచ్చే అనారోగ్య సమస్యలను గుర్తించి అప్పటి కప్పుడు వైద్య సాయం అందించాల్సి ఉంది. ◗ సీజనల్ వ్యాధుల నివారణకు విధిగా టీకాలు వేయించాలి. ◗ ప్రధానంగా దాణా ఇబ్బందులు లేకుండా వర్షాకాలంలో ముందస్తుగా దాచుకోవడం శ్రేయస్కరం.



- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

రైతేరాజు



తితిదే డిప్యూటీ ఈవో ఆర్1 భాస్కర్‌కు రగ్గులు అందిస్తున్న రేమండ్స్ అధినేత గౌతమ్ సింఘానియా తదితరులు

తితిదేకు రేమండ్స్ వితరణ

తిరుమల, న్యూస్‌టుడే: తితిదేకు రేమండ్స్ అధినేత గౌతమ్ సింఘానియా వెయ్యి రగ్గులను విరాళంగా అందజేశారు. స్థానిక సునీత్ కుటీర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రేమండ్స్ అధినేత వాటిని తితిదే డిప్యూటీ ఈవో ఆర్1 భాస్కర్‌కు అందజేశారు. వాటి విలువ రూ.20 లక్షల వరకు ఉంటుందని తిరుమలలోని రేమండ్స్ ప్రతినిధి రాజశేఖర్ తెలిపారు. తితిదే రిసెప్షన్ ఉద్యోగి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ సోమవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.



శ్రీవారి ఆలయం ఎదుట మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ

గూడూరులో ఆర్వోబీ నిర్మాణం చేపట్టండి

రైల్వే జీఎంకు మాజీ ఎంపీ వరప్రసాద్ వినతి

తిరుపతి (రైల్వే), న్యూస్‌టుడే: గూడూరు పట్టణంలో రైల్వే అండర్ బ్రిడ్జ్ (ఆర్వోబీ) నిర్మాణం చేపట్టాలని తిరుపతి మాజీ ఎంపీ, భాజపా నేత వరప్రసాద్ కోరారు. గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల పరిధిలోని రైల్వేకు సంబంధించిన ప్రాజెక్టులు, సమస్యలపై ద.మ.రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను సికింద్రాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. గూడూరు ఎస్ఆర్ థియేటర్ వద్ద లెవెల్ క్రాసింగ్‌కు బదులుగా సబ్‌వే నిర్మించాలని, సికింద్రాబాద్- తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను గూడూరు జంక్షన్‌లో ఆపాలని, సూళ్లూరుపేట నియోజకవర్గానికి సంబంధించి నాయుడుపేట స్టేషన్‌లో ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని, అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను సూళ్లూరుపేట వరకు పొడిగించాలని, హౌరా ఎక్స్‌ప్రెస్‌ను సూళ్లూరుపేట స్టేషన్‌లో ఆపాలని, ఇదే పట్టణంలో సబ్‌వే పనులు పూర్తిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎంపీ వరప్రసాద్

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని పలువురు ప్రముఖులు సోమవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి మూలమూర్తిని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి దర్శించుకున్నారు. వీరికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.



శ్రీవారి ఆలయం ఎదుట ఎంపీ మాగుంట శ్రీనివాసులు

బ్రహ్మోత్సవాలకు ఆర్టీసీ ఆదాయం రూ.10.08 కోట్లు

ఈ ఏడాది అత్యధికంగా సేవలు


తిరుపతి (ఆర్టీసీ), న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆర్టీసీ రూ.10.08 కోట్ల ఆదాయం ఆర్జించింది. ఈ నెల 2 నుంచి 12వ తేదీ వరకు జరిగిన బ్రహ్మోత్సవాల్లో తిరుమల- తిరుపతి మధ్య మొత్తం 404 బస్సులు వినియోగించారు. 34,528 ట్రిప్పులతో 10.77 లక్షల మంది భక్తులకు సేవలు అందించారు. 2023 మొదటి బ్రహ్మోత్సవాల్లో 31,969 ట్రిప్పులతో 8.56 లక్షల మంది, రెండోసారి జరిగిన బ్రహ్మోత్సవాల్లో 31,836 ట్రిప్పులతో 8.65 లక్షల మందిని తరలించారు. ఐదేళ్లలో జరిగిన బ్రహ్మోత్సవాలతో పోలిస్తే ఈ ఏడాది అత్యధికంగా ట్రిప్పులు, భక్తుల రద్దీతో ఆదాయం వచ్చినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి టి.చెంగల్ రెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ఆర్టీసీ విజయవంతం కావడానికి సహకరించిన తితిదే, పోలీసు శాఖ ఉన్నతాధికారులకు, ఆర్టీసీలోని అన్ని యూనియన్ల నాయకులకు, అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

అరణియార్‌లో కొట్టుకుపోయి వ్యక్తి మృతి

నాగలాపురం, న్యూస్‌టుడే: మండలంలోని అరణియార్ కాలువలో కారణి వద్ద వ్యక్తి కొట్టుకుపోయి మృతి చెందాడు. ఎస్సై సునీల్ కథనం మేరకు.. కారణికి చెందిన కృష్ణయ్య అనారోగ్యంతో మరణించాడు. అతని అంత్యక్రియలను స్థానిక అరణియార్ కాలువ సమీపంలో ఆదివారం నిర్వహించారు. ఈ పనుల్లో పాల్గొన్న అనంతరం ఇంటికి తిరుగుముఖం పట్టిన అతని బంధువుల్లో వడివేలు (35) కాలువలో పడి కనిపించకుండా పోయాడు. బంధువులు గాలించినా ఫలితం లేక పోవడంతో పోలీసులు, గజ ఈతగాళ్ల సహాయంతో వెతకగా సోమవారం మృతదేహాన్ని కనుగొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడుకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

తడ, న్యూస్‌టుడే: అపాచీ కార్మికురాలు గుంజి వనజ(28)ను హత్య చేసిన కేసులో నిందితుడు మీజూరు సురేష్‌ను సోమవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ తెలిపారు. ఈ నెల 11న చిట్టమూరు మండలం కుమ్మరిపాళేనికి చెందిన గుంజి వనజ అపాచీ పరిశ్రమలో విధుల్లో ఉండగా.. అక్కడే పనిచేసే సురేష్ కత్తెరతో పొడిచి హత్య చేసిన విషయం తెలిసిందే. వనజను ఐదేళ్లుగా నిందితుడు లైంగికంగా వేధిస్తూ వచ్చాడు. ఈ నెల 11న కూడా క్యాంటీన్‌లో ఆమెను వేధించాడు. అదే పరిశ్రమలో పని చేసే ఆమె భర్తకు చెప్పడంతో ఆయన మందలించాడు. దీంతో నిందితుడు ఆమెను చంపాలనుకున్నాడు. ఈ క్రమంలో హత్యకు తెగబడ్డాడు. కేసు దర్యాప్తు చేపట్టిన తడ ఎస్సై కొండప్ప నాయుడు సురేష్‌ను అరెస్టు చేశారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ మురళీకృష్ణ, ఎస్సై కొండప్ప నాయుడు

ఘాట్ రోడ్డులో కారు ప్రమాదం

తిరుమల, న్యూస్‌టుడే: మొదటి ఘాట్‌రోడ్డులో కారు ప్రమాదానికి గురైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. చెన్నైకు చెందిన భక్తులు సోమవారం శ్రీవారిని దర్శించుకుని తిరుపతికి వస్తుండగా వినాయక స్వామి ఆలయ సమీపంలో అదుపుతప్పింది. పక్కనే ఉన్న రక్షణగోడను అనంతరం కొండను ఢీకొనగా అందులోనివారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఘాట్‌రోడ్డు సిబ్బంది కారును పక్కకు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

యువకుడిపై ఆకతాయిల దాడి



గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పరిసర ప్రాంతాల్లో ఓ యువకుడిని కొందరు యువకులు దారుణంగా కొట్టడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి ఓ వీడియో సోమవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కొంతమంది ఆకతాయిలు ఓ యువకుడిని చేత్తో కొడుతూ, కాలితో తన్నుతూ దాడి చేశారు. అసలు యువకుడిని ఎందుకు కొట్టారు. ఆ యువకుడిని కొట్టిన ఆకతాయి యువకులు ఎక్కడివారు అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయంపై రెండో పట్టణ సీఐ శ్రీనివాస్‌ని వివరణ కోరగా ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

అత్తమామలపై అల్లుడు..

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆస్తి తగాదాల విషయంలో పిల్లనిచ్చిన అత్తమామలపై అల్లుడు విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన గూడూరు ఇందిరానగర్‌లో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ వివరాల మేరకు. . ఇందిరానగర్‌కు చెందిన కృష్ణారావు, ధనలక్ష్మి దంపతుల కుమార్తె మహాలక్ష్మిని విజయవాడకు చెందిన సుబ్రహ్మణ్యంతో కొన్నేళ్ల కిందట వివాహం చేశారు. ఈ క్రమంలో అల్లుడు సుబ్రహ్మణ్యం, అత్తమామలకు ఆస్తి విషయంలో తరచూ గొడవ జరిగేది. ఆదివారం రాత్రి సుబ్రహ్మణ్యం, అతని బంధువులు నలుగురు ఇందిరానగర్‌కి వచ్చి కృష్ణారావు, ధనలక్ష్మితో ఘర్షణ పడి ఇనుప రాడ్డుతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

తిరుపతి

●తిరుపతి ● చంద్రగిరి

28 నుంచి కల్యాణ వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు

చంద్రగిరి, న్యూస్‌టుడే: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 28వ తేదీ నుంచి మూడురోజులపాటు పవిత్రోత్సవాలు నిర్వహించడానికి తితిదే శ్రీకారం చుట్టనుంది. ఈక్రమంలో 27న ఆదివారం రాత్రి సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణంతో ఉత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభం కానున్నాయి. 30న రాత్రి 7 గంటలకు పూర్ణాహుతితో పరిసమాప్తం కానున్నాయి. పవిత్రోత్సవాల సందర్భంగా రోజూ ఉదయం 11 నుంచి 12 వరకు స్నపనతిరుమంజనం, సాయంత్రం తిరుచ్చి వాహన సేవ ఉంటుంది.

ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ

పాకాల, న్యూస్‌టుడే: మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఉపసర్పంచితో పాటు ఇద్దరు వార్డు సభ్యులకు స్థానిక మండల ప్రజా పరిషత్తు సమావేశ మందిరంలో మంగళవారం నుంచి శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కార్యాలయ అధికారులు తెలియజేశారు. రెండురోజుల పాటు జరిగే శిక్షణకు సంబంధిత వ్యక్తులు హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

తిరుపతి (నగరం): నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ చంద్రశేఖర రావు ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల నేపథ్యంలో నష్టతీవ్రతను తగ్గించడంలో భాగంగా ఆర్డీవో కార్యాలయం సబ్‌స్టేషన్, న్యూమారుతినగర్ ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరాను నిలిపివేయనున్నట్లు వెల్లడించారు.

ఎనిమిది పునరావాస కేంద్రాలు



పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రామాంజులునాయక్, ఎంపీడీవో రామచంద్ర

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: తపాను నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలతో మండలంలో ఎనిమిది ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తిరుపతి గ్రామీణ తహసీల్దార్ రామాంజులునాయక్ తెలిపారు. సోమవారం చెర్లోఇండ్లు, పేరూరు విజయనగరకాలనీ, వైఎస్ఆర్ కాలనీలను ఎంపీడీవో రామచంద్రతో కలిసి పరిశీలించారు. ప్రజలను అప్రమత్తం చేశారు. ఎటువంటి ఇబ్బంది తలెత్తినా స్థానిక పంచాయతీ, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు. పల్లపు ప్రాంతాల్లో నివాసాలు ఉంటున్న ప్రజలకు ప్రత్యేకంగా పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పేరూరు చైతన్య కళాశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

పాకాల, న్యూస్‌టుడే: తుపాను కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తిరుపతి ఆర్డీవో రామమోహన్‌రావు పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెనుగాలులు, పిడుగులు వంటి విపత్తుల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, రవాణాకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఇతర సమస్యలు తలెత్తితే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు నిత్యానందబాబు, వైద్యాధికారి మురళీకృష్ణ, ఎస్సై మహేష్‌బాబు, వ్యవసాయశాఖ, విద్యుత్‌శాఖ, ఉపాధిహామీ పథకం అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్సీపురంలో 34 మి.మీ. వర్షపాతం

రామచంద్రాపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సోమవారం మండలంలో 34 మి.మీ. వర్షం కురిసిందని తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న మూడు రోజులు మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు.

ఉద్యాన పంటల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి

రామచంద్రాపురం: ఉద్యాన పంటల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని ఉద్యానవన శాఖ అధికారి సునీల్ అన్నారు. సోమవారం కురిసిన వర్షం కారణంగా మండలంలోని సి.రామాపురంలో పలు పంట పొలాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉండడంతో పంటలను కాపాడుకునేందుకు కూరగాయల తోటల్లో నీరు నిలువ కుండా కాలువలు తీసి బయటకు పంపించాలన్నారు.

రసవత్తర పోరు షురూ..!

● తితిదే సహకార బ్యాంకు ఎన్నికలకు ప్రకటన

● 28న పోలింగ్.. అదే రోజున ఫలితాలు

● 6,349 మందికి ఓటుహక్కు



తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తితిదే ఉద్యోగుల సహకార బ్యాంకు ఎన్నికలకు నగారా మోగింది. ఏడుగురు డైరెక్టర్లతో కొలువుదీరనున్న పాలకమండలి ఎన్నికకు సోమవారం ప్రకటన వెలువడింది. కలెక్టర్ అనుమతితో సహకార శాఖ అధికారులు ఎన్నిక నిర్వహణకు సిద్ధమయ్యారు. ఎన్నికల అధికారిగా ఎన్.ఉమాపతి వ్యవహరించనున్నారు. గత పాలక మండలి పదవీకాలం సెప్టెంబర్ 20వ తేదీతో ముగిసింది. మొత్తం 6,349 మంది వాటాదారులు ఓటుహక్కు కలిగి ఉన్నారు.

నామినేషన్ల ప్రక్రియ ఇలా..

ఈనెల 19వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. 20వ తేదీన నామినేషన్ల పరిశీలన, 21వ తేదీన సాయంత్రం ఐదు గంటలలోపు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ జరగనుంది. 28వ తేదీన ఉదయం 7 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరగనుంది.

హోరెత్తుతోన్న ప్రచారం

గత ప్రభుత్వం కొందరు డైరెక్టర్లను తనకు అనుకూలంగా మార్చుకొని కార్యకలాపాలు సాగించిందనే విమర్శలు లేకపోలేదు. కొంత మంది డైరెక్టర్లు నిధులు దుర్వినియోగపరిచారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పర్యాయం పాలక, ప్రతిపక్ష పార్టీలకు ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ఏడు డైరెక్టర్ పదవులకు 2019లో 27 మంది పోటీ చేయగా ఈ పర్యాయం 37 మంది దాకా పోటీకి దిగనున్నట్లు తెలుస్తోంది. ఆయా పార్టీల మద్దతుతో అభ్యర్థులు ఇప్పటికే ఎన్నికల ప్రచారంలో దిగిపోయారు. విభాగాల వారీగా ఉద్యోగులను కలుస్తూ తమను గెలిపించాలంటూ విన్నవిస్తున్నారు. ప్రస్తుత పాలకమండలి పదవీకాలం సెప్టెంబర్ 20వ తేదీతో ముగిసింది. సాధారణ ఎన్నికలను తలపించేలా వాగ్దానాలు ఇస్తూ మేనిఫెస్టోలు విడుదల చేస్తున్నారు. ప్రధాన కూడళ్లలో బ్యానర్లు, కటౌట్లు, ఫ్లెక్సీలు పెద్దఎత్తున ఏర్పాటు చేశారు.

రెండు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు



గత ఎన్నికల నిర్వహణలో అధికారులు

తితిదే పరిపాలన భవనం ఎదుట ఉన్న శ్రీగోవిందరాజస్వామి ఉన్నత పాఠశాల, తిరుమలలోని శ్రీవేంకటేశ్వర ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం అదే రోజున మధ్యాహ్నం రెండు గంటల నుంచి తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి ఉన్నత పాఠశాల భవనంలో ఓట్ల లెక్కింపు జరగనుంది. ఆ వెంటనే ఫలితాలు వెలువరించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. 29వ తేదీన బ్యాంకు ఆవరణలో ఏడుగురు డైరెక్టర్లు బ్యాంకు అధ్యక్ష, ఉపాధ్యక్షులు, కోశాధికారిని ఎన్నుకోనున్నారు.

న్యూస్‌టుడే, తిరుపతి (నగరపాలిక)

సమస్య: పద్మావతి కల్యాణ మండపాల పక్కన ఉన్న నారాయణపురం వెళ్లే మార్గం డంపింగ్ యార్డ్‌లా మారింది. పరిసర ప్రాంతాల నుంచి చెత్తను, భవన నిర్మాణ వ్యర్థాలను ట్రాక్టర్లలో తెచ్చి ఇక్కడ వేస్తున్నారు.

– నారాయణపురం గ్రామస్థులు

సమాధానం: ఆ ప్రాంతం మఠం స్థలం. చాలా రోజులుగా సమస్య ఉంది. కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం.

– యువ అన్వేష్, వైద్యాధికారి, నగరపాలిక

న్యూస్‌టుడే, చంద్రగిరి

సమస్య: రాయలపురం పంచాయతీ వెంకటంపేట వద్ద ప్రధాన రహదారిపై వర్షపునీటితో చిన్నపాటి నీటిగుంటగా తయారైంది. అగర్తకాలువ పూడిపోవడంతో వర్షపునీరు వెళ్లే మార్గం లేకపోయింది. – సుశీలమ్మ, స్థానికురాలు

సమాధానం: పల్లెపండుగ కార్యక్రమంలో అగర్తకాల్వలో పూడికమట్టిని తొలగించి వర్షపునీరు మురుగు కాలువలోకి మళ్లించేందుకు ప్రతిపాదనలు చేశాం.

– ఎ.శేఖర్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, చంద్రగిరి



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

ఎస్వీయూ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎస్వీయూలో ఎంబీఏ చదువుతున్న తొమ్మిదిమంది విద్యార్థులు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఎగ్జిక్యూటివ్ క్యాడర్ పోస్టులకు ఎంపికయ్యారు. సోమవారం ఉపకులపతి ఆచార్య అప్పారావు మాట్లాడుతూ మొత్తం 35 మంది విద్యార్థులు ముఖాముఖికి హాజరుకాగా తొమ్మిది మంది ఎంపికయ్యారన్నారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని కోరారు. ప్రిన్సిపల్ ఆచార్య నరసయ్య తదితరులు విద్యార్థులను అభినందించారు.

జోరు వర్షం..



శ్రీనివాసం, మాధవం భక్తుల వసతి సముదాయం ఆవరణలో నిలిచిన వర్షంనీరు..



ఆర్టీసీ ఏడుకొండల బస్టాండ్ వద్ద ఇలా..

నగరంలో సోమవారం తెల్లవారుజాము నుంచి మోస్తరు వర్షం కురిసింది. రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. లోతట్టుప్రాంతాలు జలమయమయ్యాయి. శ్రీనివాసం, మాధవం భక్తుల వసతి సముదాయం, ఆర్టీసీ ఏడుకొండల బస్టాండ్, పెద్దకాపు లేవుట్ మార్గంలో వర్షంనీరు భారీగా నిలిచింది. శిల్పారామం ఆవరణంలో నిలిచిన వర్షంనీటిలోనే సందర్శకులు రాకపోకలు సాగించారు.

– ఈనాడు, తిరుపతి

రూ.10 నాణేలపై అవగాహన



రూ.10 నాణేలు అందజేస్తున్న బ్యాంకు తిరుపతి సర్కిల్ జీఎం, డీజీఎం తదితరులు

తిరుపతి (గాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: రూ.10 నాణేల చట్టపరమైన చెల్లుబాటుపై అపోహలు తొలగించడంలో భాగంగా కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో అవగాహన, ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. రీజినల్ కార్యాలయం వద్ద సోమవారం మొబైల్ కరెన్సీ వ్యాన్ సేవలను ప్రారంభించారు. తిరుపతి సర్కిల్ జీఎం పాండురంగ మిథంతాయా, డీజీఎంలు జీఎన్ మూర్తి, రవీందర్ కుమార్ అగర్వాల్, రీజినల్ హెడ్ టి.నాగరాజరావులు పాల్గొని వినియోగదారులకు రూ.10 నాణేలను పంపిణీ చేశారు. మొబైల్ కరెన్సీ వ్యాన్ ద్వారా రూ.10 లక్షల విలువైన నాణేలు పంపిణీ చేశామని, మంగళవారం మరో రూ.10 లక్షల నాణేలు పంపిణీ చేయనున్నట్లు బ్యాంకు అధికారులు తెలిపారు.

ఆర్చరీ విజేతకు శాప్ ఛైర్మన్ అభినందనలు



గణేశ్‌ను సత్కరిస్తున్న రవినాయుడు, నరసింహ యాదవ్

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: ఆసియా యూత్ ఆర్చరీ(విలువిద్య) ఛాంపియన్‌షిప్ విజేత తిరుమూరు గణేశ్‌ను ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు అభినందించారు. నాయుడుపేటకు చెందిన తిరుమూరు గణేశ్ ఈ నెల 3న చైనీస్ తైపీ వేదికగా సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 3 వరకు జరిగిన ఆసియా యూత్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించి వ్యక్తిగత, జట్టు విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించారు. ఈ సందర్భంగా రవినాయుడు తిరుపతిలోని శ్రీశ్రీనివాస క్రీడా సముదాయంలో క్రీడాకారుడిని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్, తెదేపా తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్ పాల్గొన్నారు.

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) నిర్వహించే కార్యక్రమాల్లో పోలీసు వ్యవస్థ కూడా భాగస్వామ్యమైతే సత్ఫలితాలు సాధ్యమని శాప్ ఛైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. సోమవారం డీపీవోలో ఎస్పీ సుబ్బరాయుడుని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఆ మేరకు విన్నవించారు.

వరద పనులు పూర్తయ్యేనా..?



తిరుపతి (జీవకోన), న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ గడిచిన ఏనిమిదేళ్లుగా నిర్మిస్తున్న వరదనీటి కాలువల నిర్మాణం పనులు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా పునఃప్రారంభించినా.. మధ్యలోనే ఆగిపోయాయి. కాలువల నిర్మాణం పూర్తయినా వాటిపై శ్లాబుల నిర్మాణం సుదీర్ఘకాలంగా సాగుతోంది. తిరుపతి -కరకంబాడి మార్గంలో ఇరువైపులా నిర్మిస్తున్న కాలువల్లో కరకంబాడి వైపువెళ్లే మార్గంలో దాదాపు పూర్తవ్వగా, తిరుపతి నగరం వైపు మార్గంలోని కాలవ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అయితే నెలరోజుల కిందట కాలువపై శ్లాబు నిర్మాణం కోసం కడప బండలు, ఇనుప చువ్వలను అమర్చినా ఇప్పటివరకు పనులు చేపట్టలేదు.





దుకాణం దక్కించుకున్న వారి సందడి



వర్షంలో ఇలా విధులు





ఎక్సైజ్, పోలీసు అధికారులు ● నగదు సర్దుకుంటున్న బ్యాంక్ సిబ్బంది

పొంగే.. ఆనందం

మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ ఉత్కంఠ రేపింది. అదృష్టం వరించకపోదా అంటూ చివరి క్షణం వరకు ఎంతో ఆశగా వీక్షించారు. జిల్లాలో మొత్తం 3,920 దరఖాస్తులు అందగా స్థానిక శిల్పారామంలో సోమవారం లాటరీ విధానంలో ఎంపిక ప్రక్రియ పూర్తిచేశారు. లక్కు తగలగానే కేరింతలు కొట్టారు. కొందరు ఉబ్బితబ్బియ్యారు. నగదు చెల్లింపుల ప్రక్రియ పూర్తిచేసి ఉప్పొంగే ఉత్సాహంతో ఇంటిబాట పట్టారు. – న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం)

సిద్ధేశ్వరస్వామికి విశేష పూజలు



యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: తలకోన సిద్ధేశ్వరస్వామికి సోమవారం విశేష అభిషేకం నిర్వహించారు. స్వామి వారు నందీశ్వరునిపై ఊరేగారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

రేపు మండల సమావేశం

చంద్రగిరి, న్యూస్‌టుడే: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 16న నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఎ.శేఖర్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

జింకను ఢీకొట్టిన వాహనం



తిరుపతి (బైరాగిపట్టెడ): ఎస్వీయూ సమీపంలోని వామనరావు భవన్ పరిధిలో సోమవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఓ వాహనం అక్కడ ఆహారం కోసం వేచి ఉన్న జింకను ఢీకొంది. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతుండటాన్ని గుర్తించిన స్థానికులు చికిత్స నిమిత్తం తరలించే ప్రయత్నం చేశారు.



పాలగుట్టపల్లి పరిసరాల్లో ఏనుగుల స్వైరవిహారం

పాకాల: మండలంలోని ఇ.పాలగుట్టపల్లి పంచాయతీలోని గ్రామాల్లో ఆదివారం రాత్రి అడవి ఏనుగులు స్వైరవిహారం చేశాయి. పాలగుట్టపల్లి, హరిజనవాడ ప్రాంతంలో వరి పంటకు భారీ నష్టాన్ని కలిగించాయి. కొబ్బరి, అరటి, కూరగాయ తోటలను ఇష్టారాజ్యంగా తొక్కేశాయి. రాత్రి వేళ పొలాల వైపు వెళ్లాలంటే భయంగా ఉందని, తరచూ ఏనుగుల దాడులతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ అధికారులు నష్టపరిహారం చెల్లించడంతో పాటు ఏనుగుల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



మల్లికార్జునయ్యను సత్కరిస్తున్న చెంగల్‌రెడ్డి, సంఘం నాయకులు

ఆర్టీసీ ఉద్యోగికి పురస్కారం

తిరుపతి(ఆర్టీసీ): ఆర్టీసీ అలిపిరి డిపోలో ఏడీసీగా పనిచేస్తున్న బుంగా మల్లికార్జునయ్యకు కళారంగానికి సంబంధించి అరుదైన గౌరవం దక్కింది. మహారాష్ట్ర వేదికగా ఈనెల 2న దిల్లీకి చెందిన ఫేస్ గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 'మహాత్మాగాంధీ ఎక్స్‌లెన్స్ అవార్డు'ను అందుకున్నారు. మల్లికార్జునయ్య వందకుపైగా వివిధ పాత్రలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణాధికారి చెంగల్‌రెడ్డి ఆయన్ను సత్కరించారు.

భక్తురాలి బ్యాగు అప్పగింత

తిరుచానూరు: శ్రీపద్మావతి అమ్మవారి ఆలయ విజిలెన్స్ సిబ్బంది తమకు దొరికిన బ్యాగును భక్తురాలికి అప్పగించి నిజాయితీ చాటుకున్నారు. సోమవారం బెంగళూరు చెందిన మమత ఆనంద్ కుటుంబ సభ్యులతో అమ్మవారి దర్శనార్థం వచ్చారు. క్యూలైన్‌లో వెళ్లే సమయంలో చేజార్చుకోగా ఏవీఐ బ్రహ్మానందరాజు, విజిలెన్స్ ఉద్యోగి కేవీ రమణ అందజేశారు. అందులో రూ.54,200 నగదు ఉన్నట్లు భక్తురాలు తెలిపారు.

'ఇబ్బందులు పెట్టామనడం అసత్యం'

తిరుపతి (భవానీనగర్) : తిరుచానూరులో బాలకృష్ణ నుంచి భూమిని తాము కొనుగోలు చేశామని, హైకోర్టును ఆశ్రయించాక పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రార్ డాక్యుమెంట్‌ని రెగ్యులర్ రిజిస్ట్రేషన్ సేల్‌డీడ్‌ను ఈ జూన్‌లో రిజిస్టర్ చేశామన్నారు. తాము ఇబ్బందులు పెట్టామని మీడియా ముందు ఆరోపించడం అసత్యమని తిరుపతికి చెందిన భాస్కర్ నాయుడు, సుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు.

వారపు సంత.. అసౌకర్యాల చింత

● **ఆదాయం ఉన్నా అభివృద్ధి అంతంతే**

చంద్రగిరి, న్యూస్‌టుడే: నియోజకవర్గ కేంద్రమైన చంద్రగిరిలోని వారపు సంతలో అసౌకర్యాలు తాండవిస్తున్నాయి. ప్రతి ఆదివారం ఇక్కడ సంత నిర్వహిస్తుంటారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వేలాదిమంది వినియోగదారులు వస్తుంటారు. 2004లో రూ.20 లక్షలు వెచ్చించి 70 దుకాణాల సముదాయాన్ని ఏర్పాటు చేశారు. సంతకు ఇరువైపులా ఉన్న ఆర్టీసీ బస్టాండు స్థలం, రాములవారిగుడివీధి రోడ్డుపై వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. తాగునీటి దాహం తీర్చుకోడానికి నీళ్లసీసాలకు, వాటర్ ప్యాకెట్లుకు నగదు వెచ్చించాల్సి వస్తోంది. గతనెలలో ఆరు నెలల కాలవ్యవధికి నిర్వహించిన వేలంలో పంచాయతీకి రూ.14.61 లక్షల ఆదాయం వచ్చింది. ఇంత ఆదాయం వస్తున్నా ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పనకు చొరవ తీసుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి. పాలకులు మహిళలను దృష్టిలో పెట్టుకుని వారపుసంత సముదాయంలో మరుగుదొడ్లు నిర్మించి నీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

● **గుత్తేదారు చేతివాటం:** వారపు సంత దక్కించుకున్న గుత్తేదారులు, వ్యాపారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అడిగినంత రుసుం చెల్లించకుంటే వ్యాపారులపై విరుచుకుపడుతున్నారు. 79 షెడ్లలో దుకాణాలకు రూ.300 చొప్పున అదనంగా ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. బయట ప్రాంతాల్లో, తోపుడు బండ్ల నుంచి అందినంత వసూలు చేస్తున్నారు. ఇవ్వకుంటే ఇక్కడి నుంచి వెళ్లాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. గుత్తేదారుల ఆగడాలను నియంత్రించడానికి ఒక్కో దుకాణం ఏర్పాటుకు నిర్ణీత ధరల పట్టికను ఏర్పాటు చేయాలని స్థానిక వ్యాపారులు కోరుతున్నారు.



వారపుసంతలో వ్యాపారాలు నిర్వహిస్తున్న మహిళలు

వసతుల కల్పనకు చర్యలు

వాణిజ్య సముదాయానికి ఎదురుగా ఉన్న ప్రధానగేటు సమీపంలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా మురుగుదొడ్లు నెలరోజుల్లో అందుబాటులోకి తీసుకువస్తాం. ప్రజలు, వ్యాపారుల సౌకర్యార్థం పంచాయతీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తాం.

– జి.మహేశ్వరయ్య, ఈవో చంద్రగిరి పంచాయతీ

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు



బాధ్యతలు స్వీకరిస్తున్న దృశ్యం

రేణిగుంట డీఈఈగా ఆంజనేయులు

రేణిగుంట, న్యూస్‌టుడే: ఏపీఎస్పీడీసీఎల్ రేణిగుంట డీఈఈగా ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. తిరుపతిలో పని చేస్తున్న ఆయన సోమవారం రేణిగుంటలోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీఈఈగా పని చేస్తున్న ప్రభాకర్ చిత్తూరు ప్రొటెక్షన్ విభాగానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది లేకుండా విధి నిర్వహణ చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను ఏఈలు, సిబ్బంది సన్మానించారు.

కైలాసకోనకు రాకపోకలు నిషేధం.. నారాయణవనం, న్యూస్‌టుడే: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ముందస్తుగా కైలాసకోన జలపాతం వద్దకు భక్తుల ప్రవేశాన్ని నిషేధించినట్లు కైలాసకోన కార్య నిర్వహణ కార్యదర్శి కృష్ణ నాయక్, మాజీ ఛైర్మన్ బత్తల భాస్కర్ యాదవ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) శ్రీకాళహస్తి: 80085 74555 నాగలాపురం: 98854 43308

న్యూస్‌టుడే, రేణిగుంట

సమస్య: రేణిగుంట పంచాయతీ అన్నదానసత్రం వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే దీపాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

- రాఘవ, స్థానికుడు

సమాధానం: ఇక్కడ వీధి దీపాల సమస్య నా దృష్టికి రాలేదు. సోమవారం దీపాలు ఏర్పాటు చేయిస్తాం.

- నాగేశం, సర్పంచి, రేణిగుంట

న్యూస్‌టుడే, శ్రీకాళహస్తిగ్రామీణం(ఏర్పేడు)

సమస్య: శ్రీకాళహస్తి మండలంలోని భీమవరం వ్యవసాయ పొలాల్లో 11కేవీ విద్యుత్తు తీగలు కిందకు వేళాడుతుండటంతో ప్రమాదం పొంచి ఉంది. అసలే వర్షాకాలం కావడంతో తెగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి. **- కుమార్, స్థానికుడు**

సమాధానం: వెంటనే సంఘటన స్థలాన్ని పరిశీలించి విద్యుత్తు తీగలను సరిచేసి సమస్యను పరిష్కరిస్తాం.

- రాజేష్, విద్యుత్తుశాఖ ఏఈ, శ్రీకాళహస్తి మండలం

న్యూస్‌టుడే, సత్యవేడు

సమస్య: తపాలా కార్యాలయ సమీపంలోని ఆటోస్టాండ్ వద్ద చుట్టుపక్కల దుకాణాల నుంచి వచ్చే చెత్తను బుట్టలతో గుట్టలు గుట్టలుగా పారపోస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. **- సురేష్, స్థానికుడు**

సమాధానం: ఆటోస్టాండు వద్ద చెత్త వేయకుండా దుకాణ దారులకు తెలియజేస్తాం. వేసిన వారిపై చర్యలు తీసుకుంటాం. **- మునిరవికుమార్, పంచాయతీ కార్యదర్శి**



సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

పండగలా భూమిపూజ

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఏర్పేడు మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో పల్లెపండుగ వారోత్సవాలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి, ఎంపీడీవో సౌభాగ్యం ఆధ్వర్యంలో పల్లం పంచాయతీలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పల్లెపండుగ వారోత్సవాలను ప్రభుత్వం చేపట్టిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షులు పొన్నారావు, చంద్రశేఖర్‌నాయుడు, కృష్ణవేణి, సుధాకర్ పాల్గొన్నారు.

● శ్రీకాళహస్తి మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో రూ. రెండు కోట్లతో 67 అభివృద్ధి పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టినట్లు ఎంపీడీవో పఠాన్ రఫీఖాన్ తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం బీవీపురంలో పల్లెపండుగ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వివరించారు. అన్నిశాఖల అధికారులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సత్యవేడు: దేశానికి పల్లెలు పట్టుకొమ్మలని, పల్లెలు బాగుంటేనే దేశాభివృద్ధి చెందుతుందని తెదేపా మాజీ జిల్లా జడ్పీ వైస్ ఛైర్మన్ సుందరరామిరెడ్డి అన్నారు. పల్లెపండగ-పంచాయతీ వారోత్సవాలు పురస్కరించుకుని సోమవారం మండలంలోని దాసుకుప్పం గ్రామంలో రూ.15లక్షల సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణమూర్తి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, తెదేపా నాయకులు లోకయ్యరెడ్డి, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమాన్ని రేణిగుంట మండలంలోని తూకివాకం గ్రామ పంచాయతీలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగానగర్‌లోని నూతన సిమెంట్ రోడ్డుకు భూమి పూజచేసి పనులను ప్రారంభించారు. రూ.8లక్షల అంచనాలతో ఈ రోడ్డు పనులను ప్రారంభిస్తున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి భాస్కరయాదవ్, తెదేపా నాయకులు నాగసుబ్రహ్మణ్యం రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: మండలంలోని పల్లెపండుగ వారోత్సవాలను మండల అధికారులు సోమవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రాధారాణి ఆధ్వర్యంలో మండలంలోని కాళంగి, బ్రాహ్మణపల్లి, ఆదరం, కండ్లూరు గ్రామాల్లో పల్లెపండుగ వారోత్సవాలను నిర్వహించారు. తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త శ్రీపతిబాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి పైగ్రామాల్లో రూ. 20 లక్షల సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపీనాథరెడ్డి, సురేష్‌రెడ్డి, రామాంజులనాయుడు, విజయకుమార్‌నాయుడు పాల్గొన్నారు.

కంకర రాళ్లు.. భారీ గోతులు



పూసలపల్లి, చిన్నాయగుంట గ్రామాలకు వెళ్లే ఆర్‌అనంతాపురం రహదారి దుస్థితి ●గుంతలు పడిన ఆలత్తూరు రహదారి

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: మండలంలోని రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్‌అనంతాపురం గ్రామ ప్రధాన రహదారి. శ్రీకాళహస్తి-తడ రహదారి పదవమైలు నుంచి వెళ్లే ఈ రహదారి గత ఐదేళ్లుగా కనీస మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో భారీ గుంతలు ఏర్పడి బావులను తలపిస్తున్నాయి. కంకరరాళ్లు తేలడంతో రహదారిపై వెళుతున్న ఆటోలు, ఇతర వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. మండలంలోని జీఎన్‌కండ్రిగ, చిన్నాయగుంట, పూసలపల్లి, తపానగర్, బంగ్లాతోట, జంబుగోళం గ్రామాలకు వెళ్లాలంటే ఇదే రహదారి గుండా వెళ్లాల్సి ఉంది. 6 కి.మీ. దూరం ఉన్న ఈ రహదారి పూర్తిగా మరమ్మతులకు గురైంది.

అధ్వానంగా రహదారి

మండలంలోని శ్రీకాళహస్తి-తడ రహదారి నుంచి ఆలత్తూరు, పుత్తేరి, రెడ్డిగుంటబాడవ, పీవీకండ్రిగ గ్రామాలకు వెళ్లే రహదారి మరింత దారుణంగా తయారైంది. మండలంలోని ఈ గ్రామాల పరిధిలో క్వారీలు అధికంగా ఉండడంతో కంకరను తరలించే వాహనాలు స్థాయికి మించి అధిక బరువుతో తిరుగున్నాయి. దీంతో వాహనాల రాకపోకల సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలుగానీ, వెనుక వైపు నుంచి ముందుకు వెళ్లే వాహన చోదకులుగాని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మితిమీరిన బరువుతో వెళ్లుతున్న వాహనాల కారణంగా రహదారి పొడవునా భారీ గుంతలు ఏర్పడ్డాయి. 5.కి.మీ ఈ రహదారి దాటాలంటే వాహనదారులు అష్టకష్టాలు పడుతున్నారు. ఆటో, ద్విచక్రవాహన దారులు అను నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు.

అత్యవసర సేవలకు తిప్పలు

భారీ గుంతల కారణంగా అత్యవసర సేవలందించే 108 వాహనాలు సకాలంలో చేరుకోలేక పోతున్నాయి. కంకర లారీలు శ్రీకాళహస్తి-తడ రహదారి ఆలత్తూరు కూడలి వద్ద మలుపు తిరిగే సమయంలో అధిక బరువు కారణంగా రహదారి గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం కంకర తరలిస్తూ కోట్లు వ్యాపారం చేస్తున్నా రవాణాకు ఉపయోగపడే రహదారిని పట్టించుకోక పోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పెద్దపాలవేడు గ్రామానికి వెళ్లే రహదారి నిర్మాణానికి నోచుకోక పోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రయాణం దినదినగండం



దినదిన గండంగా ప్రయాణం సాగుతోంది. జీవనోపాధికి ప్రతి రోజూ గ్రామం నుంచి పట్టణాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. బావులను తలపించే గుంతల్లో ప్రయాణిస్తుంటే ద్విచక్రవాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. రహదారి నిర్మాణం చేపట్టి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలి.

– ముద్దుకృష్ణ, జీఎన్‌కండ్రిగ

ఉన్నతాధికారుల దృష్టికి సమస్య

రహదారుల్లో ఏర్పడి గుంతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం.

– త్రివిక్రమరావు, ఎంపీడీవో

అధికారులు అప్రమత్తంగా ఉండండి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డ్వామా పీడీ

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: తుపాను నేపథ్యంలో వరదల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని కేవీబీపురం, బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాళెం, సత్యవేడు మండలాల్లో ఆయన పర్యటన చేశారు. ఆయా ఎంపీడీవో కార్యాలయాలలో వరద పరిస్థితులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా గ్రామాలలో ముంపు ప్రాంతాలు, నదులు, వాగుల కారణంగా జలమయమయ్యే ప్రాంతాలలో నిఘా ఉంచి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. గతంలో వరదల కారణంగా తలెత్తిన సమస్యలు, జనజీవనానికి ఇబ్బందులకు గురైన ప్రాంతాల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, ప్రజలకు ఎలాంటి కష్ట, నష్టాలు రాకుండా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దారు రాజశేఖర్, వైద్యశాఖ, జలవనరులశాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో జాగ్రత్త



లక్ష్మీపురం ఎస్టీకాలనీ వాసులతో మాట్లాడుతున్న తహసీల్దారు సుబ్రహ్మణ్యం

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు సుబ్రహ్మణ్యం సూచించారు. సోమవారం ఆయన ఎంపీడీవో త్రివిక్రమరావు, ఎస్సై విశ్వనాథనాయుడుతో కలసి అధికారులను అప్రమత్తం చేశారు. పర్యాటక క్షేత్రమైన ఉబ్బల మడుగు జలపాతంలో పర్యాటకులను అనుమతించరాదని సిబ్బందికి సూచించామన్నారు. పూరి గుడిసెలు, దెబ్బతిన్న ఇళ్లలో నివాసం ఉండేవారి వివరాలు సేకరించి స్థానికంగా ఉండే పాఠశాల భవనాలు, సచివాలయాల్లో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్టీకాలనీలు సందర్శించి కాలనీ వాసులకు వర్షాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డీటీ చంద్రబాబునాయుడు, ఎంఈవో మునిసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

గాంధీ వీధిలో పారిశుద్ధ్య చర్యలు

నాగలాపురం, న్యూస్‌టుడే: నాగలాపురం గాంధీ వీధిలో రహదారులను పంచాయతీ సిబ్బంది సోమవారం శుభ్రం చేశారు. రహదారులపైనే చెత్తా చెదారాలతో అధ్వాన పారిశుద్ధ్యంపై ఈ నెల 14వ తేదీన 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సర్పంచి చిన్నదురైసుధ స్పందించారు. సిబ్బందితో రహదారులను శుభ్రం చేయించారు.

స్పందనకు పందనం

మురుగు కాలువలు శుభ్రం

రేణిగుంట, న్యూస్‌టుడే: రేణిగుంట మండలంలోని కరకంబాడి పంచాయతీలో రైల్వేగేటు ఎదుట ఉన్న రోడ్డులో డ్రైన్లు అధ్వానంగా మారింది. దీనిపై ఇటీవల ఈనాడులో 'మేమున్నాం మీకుతోడుగా'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి ఎంజీ రమేష్ డ్రైన్లు శుభ్రం చేయించారు.

శ్రీకాళహస్తిలో...

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి పట్టణంలో పేరుకు పోయిన మురుగు కాలువలను పురపాలకశాఖ అధికారులు శుభ్రం చేయించారు. పట్టణంలోని మురుగు కాలువలు పూడిపోవడంతో వర్షాకాలంలో వీధులమీద నీరు ప్రవహిస్తోందని ఈనాడులో సోమవారం 'అల్పపీడనం.. అప్రమత్తమేనా..' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై పురలపాక సంఘం కమిషనర్ గిరికుమార్ స్పందించారు. పట్టణంలో మురుగు కాలువలను శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ప్రధాన మురుగు కాలువలను పారిశుద్ధ్యకార్మికులు శుభ్రం చేసి నీరు నిల్వచేరకుండా చర్యలు చేపట్టారు.

మురుగు తొలగదు.. రోగం వదలదు



శ్రీకాళహస్తి మండలంలోని వెల్లపాడుకి సమీపంలోని పరిశ్రమ నుంచి వెలువడే కలుషిత నీటితో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కన మురుగునీరు నిల్వ చేరుతుండటంతో నిత్యం దుర్వాస వెదజల్లుతోంది. సాయంత్రమైతే దోమల బెడద అధికమై రోగాలతో ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా ప్రయోజనం లేదని స్థానికులు వాపోతున్నారు. దీనిపై ఎంపీడీవో పఠాన్ రఫీఖాన్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తిగ్రామీణం (ఏర్పేడు)

అక్రమానికి ఆనవాళ్లు



మట్టి అక్రమ రవాణాతో ఏర్పేడు చెరువులో బావుల తలపించే గుంతలు ఏర్పాడ్డాయి. ప్రధాన రహదారికి ఆనుకొని ఉండటంతో వైకాపా పాలనలో నేతలు పెద్దఎత్తున మట్టి అమ్మకాలు చేపట్టి రూ.కోట్లు కాజేశారు. రాత్రింబవళ్లు తేడా లేకుండా పొక్లెయిన్‌లతో తవ్వకాలు జరిపి టిప్పర్లతో బయట ప్రాంతాలకు తరలించడంతో 20 అడుగుల మేర గుంతలు ఏర్పడ్డాయి. అయితే తప్పును కప్పిపుచ్చు కోవడానికి నేతలు మరలా నామమాత్రంగా పూడ్చినప్పటికీ గుంతలు అలానే దర్శనమిస్తుండటంతో రానున్న వర్షాకాలంలో పెనుప్రమాదం నెలకోనున్నది. విద్యుత్తు స్తంభాలు సైతం నేల కొరిగే స్థాయిలో ఉండటంతో అక్రమార్కుల పాపం అధికారులకు శాపంగా మారనున్నది. **- న్యూస్‌టుడే, ఏర్పేడు**

ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభం



నాగలాపురం, పిచ్చాటూరు మండలాల్లో ఇటీవల మెరుగైన విద్యుత్ సరఫరాకు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. మూడు నెలల కిందట ఏర్పాటు చేసిన ఈ స్తంభాలు తుపాను ప్రభావం ప్రారంభం కాకముందే వాలిపోతున్నాయి. గుత్తేదారులు, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. పిచ్చాటూరు మండలంలోని రామాపురం వద్ద సోమవారం తేలికపాటి గాలులకే కొన్ని విద్యుత్ స్తంభాలు వాలిపోయి ప్రమాదభరితంగా మారాయి. తుపాను ఉధృతమైతే పరిస్థితి ఎలాగుంటోందనని రైతులు, గ్రామీణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, నాగలాపురం**

అంబలి పోసి.. ఆకలి తీర్చి



వర్షం కారణంగా పనుల్లేక ఖాళీగా ఉన్న కూలీలకు స్వయంభు ఆశ్రమం బాసటగా నిలుస్తోంది. ఆకలి కష్టాలు తీర్చేందుకు వీలుగా రోజూ ఉదయం వేళ అంబలిని, మధ్యాహ్నం కడుపు నిండా భోజన వసతులు క్రమం తప్పకుండా అందుబాటులోకి తీసుకువస్తున్నారు. అయితే వర్షం కారణంగా వివిధ ప్రాంతాల నుంచి కూలీ పనుల నిమిత్తం ఇక్కడకు వచ్చిన కూలీలకు ఇక్కడి స్వయంభుస్వామి ఆశ్రమం అండగా నిలుస్తోంది. వచ్చిన వాళ్లందరికీ లేదనకుండా అంబలి, భోజనాలు పెట్టి ఆకలి తీర్చడం పట్ల పలువురు స్వయంభు స్వామి(అంబలి స్వామి) సేవలను కొనియాడుతున్నారు. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

దుకాణానికి అనుమతి వద్దు



ఎక్సైజ్ సీఐ లావణ్యకు వినతి పత్రాన్ని అందజేస్తున్న నివాసస్థులు

శ్రీకాళహస్తి: మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వద్దంటూ పట్టణంలోని బలరాం థియేటర్ సమీపంలో నివాసముంటున్న గృహస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సోమవారం ఎక్సైజ్ అధికారులకు విన్నవించారు. మద్యం దుకాణానికి అవకాశం కల్పించడం పట్ల ప్రశాంతత లేకుండా పోయిందని, నివాస గృహాల్లో ఉండలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం దుకాణాల కేటాయింపులో ఇక్కడి ప్రాంతంలో మద్యం దుకాణం వద్దంటూ ఎక్సైజ్ సీఐ లావణ్యకు వినతి పత్రాన్ని అందజేశారు.

పట్టణానికి వెలుపల దుకాణాలు ఏర్పాటు చేయాలి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి పట్టణానికి వెలుపల మద్యం దుకాణాలను ఏర్పాటు చేయాలని జైభీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్ సోమవారం తెలిపారు. పుణ్యక్షేత్రం కావడంతో దేశం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు శ్రీకాళహస్తికి వస్తుంటారని పేర్కొన్నారు.

సకాలంలో కాలమాన పట్టికలు తయారుచేయాలి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున ప్రతి ఏటా తయారుచేసే నూతన కాలమాన పట్టికల్లో ఆలస్యం వద్దని ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఆలయ అధికారులకు సోమవారం సూచించారు. తిరుమల, శ్రీశైలంతో పాటు పలు ఆలయాల్లో ఇప్పటికే నూతన కాలమాన పట్టికలు తయారు చేసి ఆవిష్కరించారని తెలిపారు.

యువకుడికి దేహశుద్ధి

ఏర్పేడు: దొంగగా భావించి ఓ యువకుడికి మేర్లపాక ఎస్సీకాలనీ వాసులు దేహశుద్ధి చేశారు. మేర్లపాక పరిసర ప్రాంతాల్లో ఇటీవల కాలంలో చోరీలు అధికంగా జరుగుతుండటంతో సోమవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న తిరుపతికి చెందిన ఓ యువకుడిని స్తంభానికి కట్టేసి దేహశుద్ధిచేసి విడిచిపెట్టారు. దొంగల ముఠాగ్రామీణ ప్రాంతాల్లో హల్‌చల్ చేస్తున్నారని పోలీసులు దృష్టి సారించి కఠినంగా శిక్షించాలని స్థానికులు తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

శ్రీకాళహస్తి: వివాహమైన ఆరు నెలల నుంచే అదనపు కట్నం కావాలని వేధింపులకు గురిచేస్తున్న భర్త, సహకరిస్తున్న కుటుంబ సభ్యులపై యువతి ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఒకటో పట్టణ సీఐ గోపి కథనం మేరకు.. స్థానిక వాటర్‌వర్క్స్ కాలనీకి చెందిన యువతికి బీఎన్‌కండ్రిగ మండలం మతాకముడి గ్రామానికి చెందిన రాజేష్‌తో నాలుగేళ్ల కిందట వివాహమైంది. అదనపు కట్నం కోసం భర్త రాజేష్, అత్త శంకరమ్మ, మామ వెంకటేష్ తరచూ వేధింపులకు గురిచేస్తుండడంతో యువతి ఫిర్యాదు మేరకు వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం.. వాహనాదారులకు శాపం



ఏర్పేడు-పంగూరు రహదారి పక్కన కూరుకుపోయిన లారీ

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఏర్పేడు-పంగూరు ప్రధాన రహదారి వెంబడి గ్యాస్ పైపులైను ఏర్పాటుకు గుత్తేదారులు పెద్దఎత్తున కాలువ తవ్వి నిర్లక్ష్యంగా వదిలేయడంతో వాహనదారులకు శాపంగా మారుతోంది. కాత్రకాయలగుంట నుంచి పంగూరు సమీపంలోని వెంకటగిరి ప్రధాన రహదారి వరకు పైపులైను ఏర్పాటుచేసి కాలువను పూడ్చకుండానే వదిలేశారు. దీన్ని పసిగట్టలేని వాహనచోదకులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం కురిసిన వర్షానికి రహదారిపై ప్రయాణించే వాహనాలు రోడ్డుపై కూరుకుపోయాయి. దీంతో రహదారిపై పెద్దఎత్తున ట్రాఫిక్ స్తంభవించింది. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకుంటే సమస్య తీవ్రం కానుంది. రోడ్డుభవనాలశాఖ ఏఈ ప్రమీలను వివరణ కోరగా గుంతలను పూడ్చి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

19న ఉద్యోగ మేళా.. తొట్టంబేడు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఎస్వీఏ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.శ్రీలత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణం, పిచ్చాటూరు రోడ్డులోని కళాశాలలో జరిగే ఉద్యోగ మేళాలో కోల్గేట్, అమరరాజా, కోల్మాన్ సర్వీసెస్‌తో పాటు పలు కంపెనీ ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన వారు హాజరు కావాలన్నారు. విద్యార్హత ధ్రువ పత్రాల నకళ్లు, బయోడేటా, ఫొటోలు, ఆధార్ కార్డుతో నేరుగా ముఖాముఖీకి హాజరు కావాలన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన.. ఏర్పేడు: బెరకా ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో మండలంలోని కందాడ పంచాయతీలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. అమెరికన్ లేయర్ కటి ఆసుపత్రి సిబ్బందితో కంటి పరీక్షలు నిర్వహించారు.

అధికారులపై డ్వామా పీడీ ఆగ్రహం

కేవీబీపురం, న్యూస్‌టుడే: వరదలపై సమీక్షించేందుకు కేవీబీపురం ఎంపీడీవో కార్యాలయానికి ఉదయం 9 గంటలకే చేరుకున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ కొంత మంది మండల అధికారులు, సచివాలయ సిబ్బంది కార్యాలయంలో లేక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండలంలో వరద ప్రభావిత ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి వాటిపై చర్చించేందుకు ఆయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ సిబ్బంది నిర్లక్ష్యం వహించడంపట్ల అసహనం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం చూపితే సంబంధిత సిబ్బందిపై కఠినంగా చర్యలు ఉంటాయని పీడీ స్పష్టం చేశారు.

స్థానికులపై ఆంక్షలు తగదు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్థానికుల దర్శనాలపై ఆంక్షలు విధించడం తగదని ఆలయ పాలకమండలి మాజీ సభ్యులు చిట్టివేలు జయగోపాల్ సోమవారం తెలిపారు. దర్శనానికి ఉదయం, సాయంత్రం కొంత సమయం కేటాయించడం, ఆధార్ కార్డును పీఆర్వో కార్యాలయంలో నమోదు చేసుకుని రసీదు తీసుకోవడం వంటివాటితో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని వాపోయారు. ఉదయం 8.30గంట వరకు, సాయంత్రం 8 గంటల నుంచి ఏకాంత సేవ వరకు స్థానికులు అధిక సంఖ్యలో ఆలయాన్ని దర్శించుకుంటారని పేర్కొన్నారు. అయితే ఆలయ అధికారుల నిర్ణయంతో ఇబ్బందులు ఏదుర్కోనున్నారని వివరించారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని నూతన విధానానికి స్వస్తి పలకాలని కోరారు.

స్థానికులకు ఆధార్ అనుమతి

చర్చనీయాంశంగా ఈవో నిర్ణయం



శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పీఆర్వో కార్యాలయం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చే స్థానికులు ఇకపై ఆధార్‌కార్డు చూపించి నిర్దేశిత వేళల్లో దర్శనాలకు వెళ్లాలంటూ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ తీసుకున్న నిర్ణయం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఇప్పటికే స్థానికులకు ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు రాత్రి వేళల్లో 7.30 నుంచి 8.30 గంటల వరకు స్థానికులకు ఉచిత దర్శనం అందుబాటులో ఉంది. రద్దీ సమయాల్లో సిబ్బంది ఎవరైనా నిలుపుదల చేసినా స్థానికులమని చెప్పి విన్నవించి మరీ దర్శనాలకు వెళ్తున్నారు. ఎవరు స్థానికులు.. ఎవరు స్థానికేతరులు అన్న విషయం విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులు, భద్రతా సిబ్బంది ఇలా అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇకపై స్థానికులు ఆలయ ఆవరణలోని పీఆర్వో కార్యాలయంలో ఆధార్‌కార్డును చూపించి అనుమతి తీసుకుని, మహాద్వారం నుంచి సాధారణ క్యూలైన్ ద్వారా దర్శనాలకు అనుమతిస్తామంటూ తాజాగా నిర్ణయించడం పట్ల స్థానికుల నుంచి విమర్శలు తలెత్తుతున్నాయి. పీఆర్వో కార్యాలయానికి వెళ్లి, అనుమతి తీసుకుని అక్కడ నుంచి సాధారణ క్యూలైన్ ద్వారా వెళ్లడం ప్రయాసలతో కూడినదని, అదేదో మహాద్వారం వద్ద ఉన్న వాళ్లకు ఆధార్ చూపించి అక్కడ నుంచి లోనికి పంపేలా నిర్ణయం చేస్తే బావుంటుందని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. అసలే పీఆర్వో కార్యాలయం ఉద్యోగులందరూ వీఐపీల సేవలో తలమునకలై ఉంటారు. ఈ పరిస్థితుల్లో స్థానికులు వెళ్లి ఆధార్‌కార్డు చూపించి దర్శనాలకు వెళ్లడం కొంత కష్టసాధ్యమే. అయినా గతంలో స్థానికులకు నిర్దేశించిన సమయంలో మళ్లీ ఆధార్‌కార్డు చూపించి దర్శనాలకు వెళ్లాలని నిబంధనలు పెట్టడం పట్ల విమర్శలు వినవస్తుండటం గమనార్హం.



మందుబాబులకు అడ్డాగా మారిన విశ్రాంతి కేంద్రం

విశ్రాంతి కేంద్రంలో ఇక్కట్లు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చే భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా అందుబాటులోకి తీసుకువచ్చిన విశ్రాంతి కేంద్రం మందుబాబులకు అడ్డాగా మారింది. మద్యం తాగిన వాళ్లు ఇక్కడకు రావడం, సేద తీరేందుకు వచ్చిన భక్తులతో గొడవలకు దిగడంతో భక్తులకు అవస్థలు తప్పడం లేదు. అర్ధరాత్రి సమయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పేదలు ఖరీదైన అద్దె గదులు తీసుకోలేక కాశీ విశ్వనాథ స్వామి ఆలయం వెనుక విశ్రాంతి కేంద్రంలో సేద తీరుతుంటారు. అయితే ఇటీవల మందుబాబులు, మత్తుపదార్థాలకు అలవాటు పడ్డ భిక్షకుల కారణంగా సామాన్య భక్తులకు అవస్థలు తప్పడం లేదు. రాత్రి వేళల్లో భద్రతా సిబ్బందిని నియమించి మందు బాబులకు అక్కడ అవకాశం లేకుండా అలాగే అక్కడకు వచ్చే భక్తులకు భద్రత కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.



పాఠశాలను మూతవేయిస్తున్న పీడీఎస్‌యూ నేతలు

నిబంధనల ఉల్లంఘన

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు జిల్లా కలెక్టర్ సెలవులు ప్రకటించినా పలు చోట్ల పాఠశాలలు కొనసాగించడంపై పీడీఎస్‌యూ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సోమవారం పాఠశాలలు నడుపుతున్న విద్యాలయాలకు వద్దకు వెళ్లి మూత వేయించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఉల్లంఘించిన ప్రైవేటు పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నేత జాకీర్ కోరారు.

గూడూరులో నిమ్మ ధరలు



మొదటి రకం: కేజీ రూ. 40 నుంచి రూ. 60 వరకు

రెండో రకం: కిలో రూ. 30 నుంచి రూ. 40 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	145
లేయర్	120
బ్రాయిలర్స్	258
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	284
లేయర్ మాంసం	204

ముంపు ప్రాంతాలపై డీఎస్పీ ఆరా.. పెళ్లకూరు: స్వర్ణముఖి నదీ తీర ముంపు ప్రాంతాలపై డీఎస్పీ చెంచుబాబు ఆరా తీశారు. పెళ్లకూరు మండలం కలవకూరు, తప్పు గుంట కండ్రిగ తదితర ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఎస్సై నాగరాజు, ఏఎస్సై మున స్వామి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

• గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

మోస్తరు వర్షాలు

బాలాయపల్లి, న్యూస్‌టుడే: మండలంలో సోమవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం ఎనిమిది గంటలకు స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద 18.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. పెరిమిడి, కోటంబేడు, నిడిగల్లు, జయంపు, వెంగమాంబాపురం తదితర గ్రామాల్లో కొద్దిపాటి వానలకే వీధులు బురదమయం అయ్యాయి.

గూడూరులో..

గూడూరు పట్టణం: అల్పపీడన ప్రభావంతో గూడూరు పట్టణం, మండలంలో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. వేకువ జాము నుంచి వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. దీంతో వివిధ పనులకు వెళ్లే కూలీలు, కళాశాల విద్యార్థులు, దూర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై నీరు నిలవడంతో వాహనదారులకు అవస్థలు తప్పలేదు.



శ్రీనివాససత్రం వద్ద బంగాళాఖాతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ముందుకొచ్చిన సముద్రం

కోట, న్యూస్‌టుడే: అల్పపీడనంతో గత రెండు రోజులుగా కోట, చిట్టమూరు మండలాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. కోట మండలం కొత్తపట్నం, గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం, యమదిన్నెపాళెం తదితర ప్రాంతాల సమీపంలో బంగాళాఖాతం ముందుకు దూసుకు వచ్చింది. ఈ క్రమంలో కోట, చిట్టమూరు మండలాల్లోని తీరప్రాంత గ్రామాలను కోట తహసీల్దారు జయజయరావు, అధికారులు సోమవారం పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు వేటకు వెళ్లరాదన్నారు. మండలంలో కొత్తపట్నం, శ్రీనివాససత్రం, పుచ్చలపల్లి, ఊనుగుంటపాళెంలో సురక్షిత కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వర్షాల కారణంగా పలు గ్రామాల రోడ్లు ధ్వంసమయ్యాయి.



తూపిలిపాలెం సముద్రం వద్ద అలల ఉద్ధృతి

54.6 మి.మీ. వర్షపాతం నమోదు

16 పునరావాస కేంద్రాల ఏర్పాటు

వాకాడు, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండ ప్రభావంతో సోమవారం వాకాడు మండలంలో వర్షాలు కురిశాయి. మొత్తం 54.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ రామయ్య తెలిపారు. తూపిలిపాలెం సముద్ర తీరం వద్ద అలల ఉద్ధృతి సాయంత్రం మరింత ఎక్కువై మూడు మీటర్లు ముందుకు వచ్చింది. తహసీల్దార్ రామయ్య, ఎంపీడీవో అన్నపూర్ణారావు, ఎస్సై నాగబాబు, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు తీర గ్రామాలైన తూపిలిపాలెం, దుగరాజపట్నం, కొండూరుపాలెం గ్రామాల్లో పర్యటించి మత్స్యకారులను అప్రమత్తం చేశారు. సముద్రంలో వేటకు వెళ్లొద్దని సూచించారు. తూపిలిపాలెం, బాలిరెడ్డిపాలెం, పంబలి, శ్రీనివాసపురం, కొండూరుపాలెం, దుగరాజపట్నం, మొనపాలెం తదితర గ్రామాల్లో తుపాను రక్షిత భవనాలు, ఉన్నత పాఠశాలల్లో 16 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



మత్స్యకారులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీవో

వరద ముప్పు.. ఏటా అదే తప్పు

☛ గతేడాది పాఠాలు.. గుణపాఠం ☛ తీర ప్రాంతాల్లో కనిపించని అప్రమత్తత

గూడూరు, న్యూస్‌టుడే: గతేడాది వరదల సమయంలో జనం అష్టకష్టాలు పడ్డారు. వాటి నుంచి అధికారులు ఇంకా గుణపాఠం నేర్చినట్లు కనిపించడం లేదు. పట్టణ స్థానిక సంస్థల్లో ముంపు ముప్పు ఎక్కువగా ఉంది. ఇందుకు ప్రధాన కారణం పంట కాలువలు, వర్షపు నీటి కాలువలు ఆక్రమణలకు గురికావడమే. అలాగే ముంపు ప్రాంత ప్రజలను ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించడంలోనూ నిర్లక్ష్యం వహిస్తున్నారు. జిల్లాలోని తీర ప్రాంత మండలాల్లో ఏటా వరద, తుపానుల ముప్పు సామాన్యుల నష్టం చిరునామాగా మారుతోంది. ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం వీరిని కుంగదీస్తోంది. శాశ్వత ప్రాతిపదికన రక్షణ చర్యలు తీసుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారు. లోతట్టు ప్రాంత వాసులను గండం నుంచి గట్టెక్కించే క్రమంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో వసతులు అరకొరగానే ఉంటున్నాయి. వాకాడు మండలం దుగరాజపట్నం, కోట మండలం గోవిందపల్లి తదితర ప్రాంతాల్లో రక్షిత కేంద్రాల్లో వసతులు లేవు సరికదా కనీసం వాటికి రంగులేసిన పరిస్థితి లేదు.



పెళ్లకూరులో దెబ్బతిన్న పంటలు (పాత చిత్రం)

గాలి వీచినా ప్రమాదమే..

వాకాడు మండలం దుగరాజపట్నం, రెడ్డిపాళెం, పూడిరాయదొరువు, కొండూరు, అందలమాల, వాలమేడు, జమీన్ కొత్తపాళెం, వాగర్ర, కోట మండలం కొత్తపట్నం, చిల్లకూరు మండలం తమ్మినపట్నం, సూళ్లూరుపేట మండలం పులికాట్, షార్ ప్రాజెక్టు, తడ మండలంలోని పులికాట్ తీరాల్లో గాలులు వీచే అవకాశాలెక్కువ. ఇక్కడ 50 కి.మీ వేగంతో గాలి వీచినా ప్రమాదమే.

పంట నష్టంతో రైతు దిగాలు..

ఏటా వరదలు, తుపానుల కారణంగా రైతులు, సామాన్య, మధ్య తరగతి వారు తీవ్రంగా నష్టపోతున్నారు. పంట నష్టాలతో రైతులు అప్పుల ఊబిలోకి చేరుతున్నారు. ప్రభుత్వాలు ఇస్తున్న నష్ట పరిహారం అరకొరగా ఉండటంతో అవి ఏ మూలకు సరిపోని పరిస్థితి. ఉదాహరణకు: పెళ్లకూరు మండలం కానూరులో రెండు సీజన్లలో మిరప రైతులు రూ. లక్షల్లో నష్టపోయినా ఒకరిద్దరికి రూ. 2వేలు పరిహారం అందజేయడం గమనార్హం. ఇలా ఇక్కడ పదుల సంఖ్యలో కుటుంబాలు రూ. లక్షల అప్పుల పాలైన పరిస్థితి. ఇదే తీరుగా స్వర్ణముఖి తీరంలో ఫిల్టర్ పాయింట్లు మాయం, ఇసుక మేటలు వెరసి రైతులు కోలుకోలేని పరిస్థితులు ఎదుర్కొంటున్నారు.



దుగరాజపట్నంలోని తుపాను రక్షిత కేంద్రం దుస్థితి

మిగ్‌జాం గాయం..

సూళ్లూరుపేట, గూడూరు ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంత వాసుల జీవనంపై మిగ్‌జాం తుపాను తీవ్ర ప్రభావం చూపింది. ఇళ్లలోకి నీరు చేరడంతో గృహోపకరణాలు దెబ్బతిన్నాయి. సూళ్లూరుపేట వట్రపాళెం, మన్నారు పోలూరు, నాయుడుపేట పట్టణంలోని తుమ్మూరు, చంద్రబాబు నగర్ ప్రాంతాల్లోని ఇళ్లు జలమయమయ్యాయి. తుమ్మూరు సంజీవ్ నగర్ వాసుల ఇళ్లలోకి నీరు చేరి ద్విచక్రవాహనాలు, ఇతర వస్తు సామగ్రి పనికి రాకుండాపోయింది. వీరికి ఎలాంటి సాయం అందలేదు.

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966
సమయం 10 AM TO 1 PM

కోట, న్యూస్‌టుడే:

సమస్య: కోటలోని ఎస్సీ గురుకుల కళాశాల, విద్యుత్తు ఉప కేంద్రానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. కోట జీడీ రోడ్డు, పీఆర్ రోడ్డు, రవి నగర్ నుంచి వచ్చే రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా మారింది. **- సంజీవి, విద్యార్థి**

సమాధానం: ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కావాల్సింది. మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. **- కిరణ్, ఏఈ**

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య: పట్టణంలోని మాళవ్యానగర్ ప్రాంతంలో డ్రైనేజీ కాలువ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు ఇళ్ల మధ్యలోనే పారుతోంది. విషపురుగులు, పాములు రావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. స్థానిక ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. **- ప్రభాకర్, మాళవ్యానగర్**

సమాధానం: పుర సిబ్బంది ద్వారా వెంటనే డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయిస్తాం. బ్లీచింగ్ చల్లి పూడికతీత చర్యలు తీసుకుంటాం. **- వెంకటేశ్వర్లు, కమిషనర్, గూడూరు**

వాకాడు, న్యూస్‌టుడే:

సమస్య: వాకాడు మండలం దుగరాజపట్నం గ్రామంలో కొంత కాలంగా వీధి దీపాలు వెలగడం లేదు. సమస్యను సర్పంచి, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. రాత్రి సమయాల్లో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా మారింది. **- శివయ్య, దుగరాజపట్నం**

సమాధానం: సర్పంచి, పంచాయతీ అధికారులతో మాట్లాడి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్డీ, వాకాడు**

సమస్య: వాకాడు ఎస్సీ కాలనీలో చెత్తకుప్పలు రోడ్డుపైనే ఉంటున్నాయి. చెత్త మురుగు కాలువల్లోకి చేరడంతో మురుగు నిల్వ ఉంటోంది. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. **- రమణయ్య, వాకాడు**

సమాధానం: చెత్తకుప్పలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- ప్రవళ్లిక, పంచాయతీ ఈవో, వాకాడు**

ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్తు సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు సిబ్బందిని అప్రమత్తం చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో నాయుడుపేట పరిసర ప్రాంతాల్లో సోమవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. మూడు రోజులు పాటు భారీ వర్షాల ఉన్న నేపథ్యంలో డీఈ వరప్రసాద్‌రెడ్డి కార్యాలయంలో సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. **తడ:** వాతావరణశాఖ ఆదేశాల నేపథ్యంలో మండలస్థాయి అధికారులు ముంపు ప్రాంతాల్లో అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని నియోజకవర్గ తుపాను ప్రత్యేక అధికారి, డీఆర్‌డీఏ పీడీ శోభన బాబు సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. **వెంకటగిరి:** తుపాను ప్రభావం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సూచించారు. **సూళ్లూరుపేట:** అల్పపీడన నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని, అధికారులు అప్రమత్తంగా ఉండి, వాటిని సమర్థంగా ఎదుర్కోవాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు సూచించారు. సూళ్లూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం తుపానుకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. పులికాట్ తీరంలోని గ్రామాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తహసీల్దార్ నరసింహారావు పాల్గొన్నారు. **దొరవారిసత్రం:** మండలంలోని కాళంగి నదీ పరివాహక ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక తహసీల్దారు శైలకుమారి సూచించారు. ఎస్సై అజయ్‌కుమార్‌తో కలిసి ముంపు గ్రామాలైన వేటగిరిపాలెం, బురదమడుగు, తనయాలి తదితర గ్రామాల్లో సోమవారం పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. **నాయుడుపేట:** అల్పపీడన ప్రభావంతో అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు హెచ్చరికలు ఉండటంతో నాయుడుపేట మండలంలో అధికార యంత్రాగం ముందస్తు జాగ్రతలు చేపట్టారు. స్వర్ణముఖి, మామిడి కాలువకు ఇరువైపులా ఉన్న లోతట్టు గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేశారు. తహసీల్దారు గీతావాణి, ఎంపీడీవో సురేష్‌బాబు, కమిషనర్ ఫజుల్లులా సోమవారం ముంపు గ్రామాల్లో పర్యటించారు.



నాయుడుపేట సబ్‌స్టేషన్‌లో పనులు చేస్తున్న విద్యుత్తు సిబ్బంది



దొరవారిసత్రం: ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దారు శైలకుమారి, ఎస్సై అజయ్‌కుమార్

ముగిసిన మద్యం దుకాణాల కేటాయింపు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పట్టణం, చిల్లకూరు మండలానికి సంబంధించి 18 మద్యం దుకాణాల కేటాయింపు లాటరీ పద్ధతిలో సోమవారం ముగిసింది. రెండు వారాలుగా మద్యం దుకాణాలు ఎవరికి దక్కుతాయా అన్న సందేహంలో ఉన్న ఆశావహుల ఉత్కంఠకి తెరపడింది. గూడూరు ఎక్సైజ్ శాఖ పరిధిలోని 12, చిల్లకూరు మండలంలో 6 దుకాణాలకు మొత్తం 209 మంది దరఖాస్తు చేసుకున్నారు. తిరుపతిలో నిర్వహించిన లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయించారు.

అజాగ్రత్తగా ఉంటే అంతే..!



గాజులపల్లి-కాలగంధ గ్రామం మధ్య ఉన్న సిమెంటు రోడ్డు ప్రమాదకరంగా మారింది. కాలగంధ చెరువు కలుజ నీటి కాలువపై 600 మీటర్లు ఉన్న ఈ రోడ్డును రెండేళ్ల కిందట నిర్మించారు. అయితే కాలువకు రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. మరోవైపు కాలువలో పిచ్చిమొక్కలు, చెట్లు విపరీతంగా పెరిగిపోవడంతో కాలువ రూపు కోల్పోయింది. ఈ దారిన వెళ్లే భారీ వాహనాలు కాలువను గమనించక పక్కకు వెళ్తే అందులో పడే ప్రమాదం ఉంది. ఈ విషయమై పీఆర్ ఏఈ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా పంచాయతీ నిధులతో రక్షణ గోడల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, బాలాయపల్లి**

నిర్వహణ లేక.. గంగ వృథా



ఓ వైపు అన్నదాతలు నీరు లేక అల్లాడిపోతుంటే.. ఉన్న నీటిని సంరక్షించాల్సిన అధికారుల నిర్లక్ష్యం కారణంగా తెలుగు గంగ నీరు వృథాగా పోతోంది. పెళ్లకూరు మండలంలోని తెలుగు గంగ కాలువ దుస్థితికి చేరుకుంది. కాలువకు గేట్లు లేకపోవడంతో వచ్చిన నీరు వచ్చినట్లు కిందికి వెళ్తోంది. దీంతో పంట సాగు ప్రశ్నార్థకంగా మారుతోంది. సంబంధిత అధికారులు కాలువలు బాగు చేయాలని రైతులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పెళ్లకూరు**

వీధులంతా మురుగు మయం



ఓజిలి మండలం వెంకటరెడ్డిపాళెం పంచాయతీలో మురుగు తాండవం చేస్తోంది. కాలువలు సక్రమంగా లేకపోవడంతో ఇళ్లలోని మురుగు వీధుల్లోకి చేరుతోంది. దీంతో దుర్గంధం వ్యాపించడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మురుగు నీటిలో రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నామని ద్విచక్రవాహన చోదకులు వాపోతున్నారు. పంచాయతీకి రాబడి వనరులున్నా అభివృద్ధి అంతంతమాత్రంగానే ఉంది. పాలకులు, అధికారులు అభివృద్ధిపై దృష్టి సారించి కాలువలు నిర్మించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం (ఓజిలి)**

ప్రతిపాదనలతో సరి..!

కోట, న్యూస్‌టుడే: ఓ వైపు అధికారుల నిర్లక్ష్యం.. మరో వైపు ఆక్రమణల కారణంగా పంట కాలువలు దుస్థితికి చేరుతున్నాయి. పూడికతీత, ఆక్రమణల తొలగింపునకు 40 సంవత్సరాలుగా అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నా కార్యచరణ రూపం దాల్చడం లేదు. దీంతో వేలాది ఎకరాల ఆయకట్టు భూములకు సాగు నీరు అందని పరిస్థితి నెలకొంది.

మేజర్ పంచాయతీ అయిన కోట మీదుగా చల్లకాలువ నుంచి 16 పంట కాలువలున్నాయి. వీటి ద్వారా 5 వేల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. కాలువలు పలు చోట్ల ఆక్రమణలకు గురయ్యాయి. దీనికి తోడు కాలువలు పూడిపోవడంతో సాగునీటి పారుదల సక్రమంగా సాగడం లేదు. ఇళ్లలోని మురుగు నీరు సైతం కాలువలోకే వదులుతున్నారు. పలు పర్యాయాలు భారీ వర్షాలు వచ్చిన సమయాల్లో కాలువలోని డ్రైనేజీ రోడ్లపై పారింది. అప్పట్లో కలెక్టర్, ఎమ్మెల్యేలు, నాయకులు పరిశీలించారు. మరమ్మతులతో సరి పెట్టారు. కాలువను బాగు చేయాలని రెండేళ్ల కిందట తెదేపా నాయకులు ధర్నాలు చేశారు. దీంతో తాత్కాలికంగా మరమ్మతులు చేసి మమ అనిపించారు.



పంట కాల్వ దుస్థితి

ప్రతిపాదనలు పంపుతాం

ప్రతిపాదనలు పంపి కాలువలు బాగు చేయిస్తాం. **- మునిరత్నం, ఇరిగేషన్ ఏఈ**

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎంకేజీఎం పాఠశాలకు చెందిన 1983-84 బ్యాచ్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పూర్వ విద్యార్థి అల్లం భారతీదేవి ఆధ్వర్యంలో సమావేశమై తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పలువురు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో సుబ్బరామయ్య, చిట్టిబాబు, కోటేశ్వరరావు, పోలయ్య, అమృత, విజయలక్ష్మి, ప్రసన్న, నాగలక్ష్మి పాల్గొన్నారు.



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు.. నాయుడుపేట: పట్టణంలోని విన్నమా పంట కాలువపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని జలవనరుల శాఖకు చెందిన ఇంజినీరింగ్ ఇన్‌ఛీఫ్ నాయుడుపేట జలవనరుల శాఖ డీఈకి ఆదేశాలు ఇచ్చారు. రూ.10కోట్లతో కాలువను ఆధునికీకరణ చేయాలని జలవనరుల శాఖ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. ఆక్రమణలు తొలగించిన తర్వాత పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేస్తారు. ఇది అమల్లోకి వస్తే లోతువానిగుంట నుంచి ఏల్ఐసీ సమీపంలో జీఎన్‌టీ రోడ్డు వరకు కాలువకు ఇరువైపులా ఉన్న భారీ కట్టడాలు తొలగించే అవకాశముంది.

ఎమ్మెల్యే పరామర్శ.. నాయుడుపేట: పురపాలక వైస్ ఛైర్మన్ ఎస్.కె రఫీ తండ్రి చాన్‌బాషా మృతి చెందడంతో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చాన్‌బాషా మృతదేహాన్ని సోమవారం సందర్శించి నివాళి అర్పించారు. రఫీ కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు మండలం కొండాగుంట, తిమ్మసముద్రం, వెంకటేశుపల్లి గ్రామాల్లో 'పల్లె పండుగ' కార్యక్రమాన్ని నిర్వహించి సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి శిలాఫలకాన్ని సోమవారం ప్రారంభించారు. కొండాగుంటలో రూ. 10లక్షలు, తిమ్మసముద్రంలో రూ. 10లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఎంపీడీవో మధుసూదన్‌రావు, తహసీల్దార్ చంద్రశేఖర్, నాయకులు నెలబల్లి భాస్కర్‌రెడ్డి, కొండూరు వెంకటేశ్వర్లురాజు, గుండాల లీలావతి పాల్గొన్నారు.

స్తంభించిన జనజీవనం



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. సోమవారం మధ్యాహ్నం వరకు వాన కురవడంతో పట్టణ వీధులు జలమయమయ్యాయి. జనజీవనం పూర్తిగా స్తంభించింది. మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో మురుగు రోడ్లపై ఏరులై పారింది. శివారు ప్రాంతాలైన ఎన్టీఆర్ కాలనీ, బీసీకాలనీ, పెరియవరం, ఎన్జీవో కాలనీ, నెహ్రూనగర్, బొగ్గలమిట్ట, రెహమత్ నగర్ తదితర ప్రాంతాల్లోని వీధులు బురదమయంగా మారాయి. **- న్యూస్‌టుడే, వెంకటగిరి**

చోరీ సొమ్ము పంపకాల్లో తేడాతోనే వ్యక్తి హత్య.. చిల్లకూరు: చోరీ చేసిన సొమ్ము పంపకాల్లో తేడా రావడంతో వ్యక్తి హత్యకు గురైనట్లు పోలీసులు సోమవారం తెలిపారు. గూడూరు గ్రామీణ సీఐ కిషోర్ బాబు, స్థానిక ఎస్సై సురేష్ బాబు వివరాల ప్రకారం.. తిక్కవరం రెవెన్యూ పరిధిలోని ఓ మామిడి తోటలో దక్కిలి మండలం దగ్గవోలు ఎస్టీ కాలనీకి చెందిన మానికల అంకయ్య, భార్య లక్ష్మమ్మ, సైదాపురం వాసి జడల వెంకటేశ్వర్లు(35), సుబ్బమ్మ దంపతులు కూలీ పనులు చేసేవారు. జల్సాలకు అలవాటు పడిన వీరు వచ్చిన డబ్బు సరిపోకపోవడంతో విద్యుత్తు మోటార్ల తీగలు చోరీ చేసేవారు. గత నెల 8, 9వ తేదీల్లో చోరీ చేసిన తీగలను విక్రయించగా వచ్చిన నగదును పంచుకునే క్రమంలో తేడా రావడంతో అంకయ్య వెంకటేశ్వర్లను హత్య చేశాడు. మృతదేహాన్ని సమీపంలోని తెలుగుగంగ కాలువ గట్టుపై పాతి పెట్టాడు. తోటలోని ముగ్గురు వ్యక్తులు కనిపించడం లేదంటూ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఉదంతం వెలుగు చూసింది. నిందితుడు అంకయ్యను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య.. దొరవారిసత్రం: దొరవారిసత్రం రైల్వే కింది వంతెన సమీపంలో రైలు పట్టాలపై కట్టువాపల్లికి చెందిన ఈదూరు రాజేంద్రప్రసాద్(39) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సమస్యలు, అనారోగ్యం కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రైల్వే పోలీసులు సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిర్లక్ష్యానికి సాక్ష్యం..!

☛ తాత్కాలిక పనులతో మమ

☛ ఆందోళనలో బాలిరెడ్డిపాలెం వాసులు

గూడూరు గ్రామీణం, వాకాడు న్యూస్‌టుడే: వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం వద్ద గతేడాది డిసెంబరులో వచ్చిన వరదలకు స్వర్ణముఖి నది పొర్లుకట్టకు గండి పడింది. ఇది జరిగి 10 నెలలు గడిచినా నేటికీ గండి పూడ్చలేదు. ప్రస్తుతం తుపాను హెచ్చరికలు, వర్షాలు పడే సూచనలతో బాలిరెడ్డిపాలెం వాసులు రెండు రోజులుగా భయాందోళన చెందుతున్నారు. గండిని అప్పట్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా వచ్చి పరిశీలించినా ఎలాంటి చలనం లేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది జులైలో ఎఫ్‌డీఆర్ కింద రూ.1.70 కోట్లు మంజూరు చేశారు. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారు పనుల పట్ల అలసత్వం వహించడంతో నేటికీ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి.



వర్షం కారణంగా నిలిచిన పొర్లుకట్ట నిర్మాణ పనులు

పరిశీలనకే పరిమితం..

తుపాను హెచ్చరికల నేపథ్యంలో రెండు రోజుల కిందట గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పనులను పరిశీలించారు. సోమవారం తహసీల్దార్, ఎంపీడీవో, జలవనరుల శాఖ అధికారులు పనులను పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని ఆదేశాలు ఇస్తున్నారే తప్పా.. పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదు. నదికి హఠాత్తుగా రాత్రికి రాత్రే వరదనీరు వస్తే గ్రామం పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. కనీసం పనులు నిలిచిన చోట ప్రత్యామ్నాయంగా ఇసుక బస్తాలు వేయించడం, వరదనీరు గ్రామంలోకి రాకుండా చర్యలు వంటివి ఏమీ సోమవారం రాత్రి వరకు చేపట్టలేదు.

ఫిర్యాదుపై స్పందన కరవు

జరుగుతున్న పనుల్లో నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి నాణ్యత లోపించేలా పనులు చేస్తున్నారని గ్రామంలోని తెదేపా నేత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు అధికార పార్టీలో అగ్రనేత కావడంతో ఫిర్యాదుపై ఇంజినీర్లు నుంచి ఎలాంటి స్పందన లేదు. కట్ట పనుల వద్ద మట్టి పోయకుండా నదిలోని ఇసుకను పోస్తున్నారని, పనుల వద్ద ఇంజినీర్ల పర్యవేక్షణ లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చర్యలు తీసుకుంటాం

ప్రస్తుతం ముంపు భయం లేదు. వర్షం తగ్గుముఖం పట్టగానే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. పనులు త్వరగా పూర్తి చేసేలా సంబంధిత గుత్తేదారును ఆదేశిస్తాం. **- రామయ్య, తహసీల్దార్**